# ప్రభాత సమాచారం

https: epaper.prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ శనివారం | 4 అక్టోబర్ 2025 | ■ 14 పేజీలు




## అశ్వరథంపై అమ్మవారి ఊరేగింపు

బాసరలో ముగిసిన శారదీయ శరన్నవరాత్రి ఉత్సవాలు

ఉమ్మడి జిల్లాలో వైభవంగా

## దసరా సంబురాలు

- ఉదయం నుంచే ఆలయాలు, దేవీ మండపాల్లో భక్తుల పూజలు
- శమీ వృక్షానికి విశేష పూజలు
- ఉమ్మడి జిల్లాలో రావణ దహనం..
- పోలీస్ స్టేషన్‌లలో ఆయుధ పూజలు చేసిన పోలీసు అధికారులు



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గురువారం విజయదశమి వేడుకలు అంబరాన్నంటాయి. భక్తుల ప్రత్యేక పూజలు, వాహన, శమీ పూజలతో ఆలయాలు కిటకిటలాడాయి. సాయంత్రం గ్రామ శివారులో పాలపిట్టను దర్శించుకున్నారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమశమీ పూజలు చేశారు. శమీ పత్రాలను పెద్దలకు అందించి ఆశీస్సులు, స్నేహితులకు, కుటుంబ సభ్యులకు అందజేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వివిధ ప్రాంతాల్లో మహిషాసుర, రావణ సంహారలీలలను కన్నుల పండువలా నిర్వహించారు. పిండివంటలు, కబుర్లు, కాలక్షేపాలతో సంతోషంగా గడిపారు. శమీ, వాహన, అమ్మవార్ల పూజలతో మహాశక్తి ఆలయాలు జనంతో కిక్కిరిసాయి.




## అభ్యర్థుల ఎంపికపై కసరత్తు..!

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

- స్థానిక ఎన్నికలకు సిద్ధమవుతున్న అధికార, ప్రతిపక్ష పార్టీలు
- స్థానిక ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న ఆయా పార్టీ నేతలు..
- బలమైన అభ్యర్థులను పోటీకి దింపేందుకు ఆయా పార్టీల అధిష్టానం కసరత్తు
- సర్వే ప్రాతిపదికనే అభ్యర్థుల ఎంపిక
- చేరికలపై దృష్టి సారించిన రాజకీయ పక్షాలు
- ముగ్గురు పేర్లతో జాబితా రూపొందించి అధిష్ఠానానికి పంపేయత్నంలో కాంగ్రెస్
- స్థానికంగానే బీఆర్ఎస్ అభ్యర్థుల ఖరారు
- ఉమ్మడి జిల్లాలో అన్ని స్థానాల్లో పోటీకి బీజేపీ సిద్ధం

జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామపంచాయతీ ఎన్నిల్లో పోటీకి దింపేందుకు రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపికపై కసరత్తులు జరుపుతున్నాయి. అంగబలం, అర్ధబలం కలిగిఉండడంతో పాటు ప్రజల్లో పేరు ప్రతిష్టలు కలిగిన నాయకులను రంగంలోకి దింపేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు సిద్ధమవుతున్నాయి. అధిష్ఠానం సూచన మేరకు కాంగ్రెస్ పార్టీ ముగ్గురు పేర్లను పంపనుంది. స్థానిక నాయకత్వం అభీష్టం మేరకు అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో బీఆర్ఎస్ ఉంది. బీజేపీ అన్ని స్థానాల్లో పోటీకి సిద్ధమవుతోంది.



## కిక్కెక్కించిన దసరా మద్యం

- ముందుగానే సరుకు కొనుగోలు
- బహిరంగంగా కనిపించని మాంసం విక్రయాలు
- లోలోపల మాత్రం ఆగని జంతు వధ
- గాంధీ జయంతి ప్రభావం పడకుండా దసరా..
- మంచిర్యాలలో రూ.60కోట్లపైనే వ్యాపారం
- 3రోజుల్లో రూ.26.38కోట్ల లిక్కర్ విక్రయాలు
- అదే జోరులో సాగిన మాంసం విక్రయాలు

-వివరాలు 11లో



భైంసా పట్టణంలో ప్రశాంతంగా

## నిమజనోత్సవ వేడుకలు

- కన్నుల పండువగ దుర్గామాత శోభాయాత్ర
- అడుగడుగునా పోలీసుల బందోబస్తు
- ఉత్సాహంగా యువత నృత్యాలు

- వివరాలు 8లో






# మళ్లీ సాగు నీటి సంఘాలు

- సాగునీటి సంఘాలకు మోక్షం...!
- మంత్రి ప్రకటనతో చిగురిస్తున్న ఆశలు
- జిల్లాలో 1239 చెరువులు, 27 చెక్ డ్యాంలు
- కడెం ప్రాజెక్టు ద్వారా సాగునీరు
- గతంలో టీడీపీ హయాంలో సంఘాల ఏర్పాటు
- మిషన్ కాకతీయ పేరుతో అటకెక్కించిన బీఆర్ఎస్
- ప్రభుత్వ నిర్ణయంతో రైతులకు మేలు

**మంచిర్యాల, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
సాగునీటి సంఘాల ఏర్పాటు అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. రాష్ట్ర సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సాటు నీటి సంఘాలనుఏర్పాటు చేస్తామన్న ప్రకటనతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. పదేళ్లకుపైగా మనుగడలో లేని సాగునీటి సంఘాలను పునరుద్ధరించాలని ఇటీవల ప్రభుత్వం నిర్ణయించగా, ఈ నెల 29న సచివాలయంలో నీటి పారుదల శాఖ అధి కారుల తో మంత్రి ఏర్పాటు చేసిన సమీక్షలోనూ ఆ అంశాన్ని పునరుద్ఘాటించారు. గతంలో మాదిరిగా సాగునీటి విని యోగ సంఘాలు ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించినట్లు మంత్రి ఉత్తమ్ సమావేశం సంద ర్భంగా గుర్తు చేశారు. రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ కోరిన మేరకు రాష్ట్రంలో మళ్లీ నీటి సంఘాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం పూనుకోవడంతో ప్రతీ చెరువు కింద ప్రత్యేకంగా సాగునీటి సంఘాన్ని ఏర్పా టు చేయాలనే ప్రతిపాదనలపై ప్రభుత్వం కసరత్తు చే స్తోంది. ఈ పాలక మండళ్లను ప్రస్తుతానికి నామినేషన్ విధానంలో నియ మించేందుకు సన్నాహాలు చేస్తోంది.

**సాగునీటి సంఘాలంటే..**
రైతుల సమూహాలు సాగునీటి అవసరాలను సమ న్వయం చేసుకొని, నీటిని సమర్ధవంతంగా ఉపయో గించుకునేందుకు కలిసి పని చేయడానికి, నీటి పంపిణీ, కాలువల నిర్వహణ, నీటి నాణ్యతా పరిరక్షణకు ఉద్దే శించి ఏర్పాటు చేసేవి సాగునీటి సంఘాలు. నీటి నిర్వ హణలో ఈ సంఘాల పాత్ర ఎంతో ఉంటుంది. సాగు నీటి సంఘాలు ఏర్పాటయితే నీటి నిల్వలు, పంపిణీ షెడ్యూల్ నిర్వహణను పకడ్బందీగా అవి అమలు చేస్తాయి. నీటి నాణ్యతను పరీక్షించడంతో పాటు ప్రభుత్వంతో సమన్వయం చేసుకొని, నీటి అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలలో పాలు పంచుకుంటాయి. ఈ సం ఘాలను బలోపేతం చేయడం ద్వారా నీటి వనరు లను సమర్ధవంతంగా వినియోగించుకోవచ్చు.

**రైతు కమిషన్ సూచన మేరకు...**
సాగునీటి వినియోగదారుల సంఘం వ్యవస్థను పు నరుద్ధరించడం వల్ల సాగునీటి వనరులను సక్రమంగా వినియోగించుకోగలుగుతారని వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ అభిప్రాయ పడుతోంది. వాటి బాగోగులు ఎప్పటికప్పుడు చూడగలుగుతామని ప్రభుత్వానికి నివేదించింది. సాగునీటి సంఘాల ఏర్పాటుకు సంబంధించి విధివిధానాలను ఖరారు చేసేందుకు కాంగ్రెస్ రాష్ట్ర నాయకుల నేతృత్వంలోని బృందం ఇప్పటికే ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. వీటిపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించిన క్రమంలో సాగునీటి సంఘాల ఏర్పాటుపై రైతుల్లో ఆసక్తి నెలకొంది. కాలువల మరమ్మతులు, నిర్వహణ పనులను చేయడానికి సాగునీటి సంఘాలకు ప్రభుత్వం నిధులు ఇవ్వనున్న ధృష్ట్యా నీటి వినియోగంలో అవినీతి అక్రమా లకు తావులేకుండా ఉండేందుకు మార్గదర్శకాలను పక డ్బంధీగా రూపొందించడంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

**జిల్లాలో 1239 చెరువులు...**
జిల్లాలో చిన్నవి, పెద్దవి కలిపి మొత్తం 1239 చెరువులున్నాయి. కడెం ప్రాజెక్టు నీటిని కాలువల ద్వారా ఈ చెరు వుల్లో నింపి జిల్లాలోని దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ వండలాల్లోని సుమారు మూడు వేల ఎకరా ల ఆయకట్టుకు సాగు నీరు అందిస్తున్నారు. వీటితో పాటు జిల్లా వ్యాప్తంగా 27 వరకు చెక్ డ్యాంలున్నాయి. గతంలో కడెం ప్రాజెక్టు పరిధిలో ఈ నీటి సంఘాలు పనిచేయగా, పదేళ్ల కాలంలో వాటి ఉనికి లేకుండాపోయింది. సాగునీటి వనరులను కాపాడటంలో రైతులను భాగస్వాములను చేయాలనే రైతు కమిషన్ కోరిక మేరకు సంఘాల ఏర్పాటుకు మార్గం సుగమమైంది.

**తొలుత చిన్న తరహా సంఘాల ఏర్పాటు...**
రాష్ట్రంలో తొలుత ప్రయోగాత్మకంగా చెరువులు, కాలువలు, తదితర చిన్ననీటి తరహా సంఘాలను ఏర్పాటు చేసి, ఆ తరువాత భారీ ప్రాజెక్టులకు విస్తరించే యోచనలో ప్రభుత్వం ఉంది. సాగునీటి సంఘాలకు క న్వీనర్గా నీటిపారుదల శాఖ అధికారులు ఉండనున్నా రు. వారి పర్యవేక్షణలో సంఘాలు తమ కార్యకలాపాలు నిర్వహిస్తాయి. రాష్ట్రంలో ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మొదలైనందున, ఎలక్షన్ల తరువాత సాగునీటి సంఘాలు ఏర్పాటు చేయనున్నారు.

# ప్రతీ ఒక్కరు ఎన్నికలకు పూర్తి సంసిద్ధమై ఉండాలి

## ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్






**బోథ్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
ప్రతి ఒక్కరూ ఎన్నికలకు సంసిద్ధమై ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. శుక్రవారం బజార్ హత్నూర్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ను శుక్రవారం ఎస్పీ అఖిల్ మహాజన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ ను పరిశీలించిన అనంతరం స్టేషన్లో ఉన్న వాహనాలను పరిశీలించి వాటి కేసుల వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ రికార్డు లను పరిశీలించి ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఎలాంటి పెండెన్సీ లేకుండా ఉండాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ నిర్వహణలో 5ఎస్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రతి గ్రామాన వీపీఓ విధానాన్ని కచ్చితంగా అమలు చేసి, సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకొని, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా ప్రతిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామస్తులతో సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సైబర్ క్రైమ్, డిజిటల్ ఫ్రాడ్, గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం వాటి వల్ల కలుగు అనర్ధాలపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. యువత, మారుమూల గ్రామీణ ప్రాంత ప్రజలు చెడు వ్యసనాల బారిన పడకుండా, చదువు పై ఉన్న ఆవశ్యకతను తెలియజేసి ఉన్నత చదువులు అభ్యసించేలా ప్రోత్సహించాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు పోలీసులపై నమ్మకం పెంపొందించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్.జీవన్ రెడ్డి, బోథ్ సీఐ ఏ. వెంకటేశ్వరరావ్ పాల్గొన్నారు.



# జన్నారం ఇంచార్జీ ఎఫ్ఆర్వోగా మమత

**జన్నారం, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
కవ్వాల్ టైగర్ జోన్ జన్నారం డివిజన్ పరిధిలోని జన్నారం రేంజ్ అటవీ శాఖ ఇన్చార్జి ఎస్ఆర్ఆగా మమత బాధ్యతలు స్వీకరించారు. గురువారం జన్నారంలోని ఎఫ్ఆర్వో కార్యాలయంలో ఆమె బాధ్యతలు చేపట్టారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు అందరూ పాటుపడాలని ఆమె కోరారు. ఇప్పటి వరకు తాళ్లపేట ఎఫ్ఆర్వో సుష్మారావు బాధ్యతలు నిర్వహించారు. ఆమె స్థానంలో ల్యాండ్ రికార్డ్స్ డీఆర్డీగా పని చేస్తున్న మమత ఇంచార్జీ ఎఫ్ఆర్వో బాధ్యతలు తీసుకున్నారు.

# కన్నెపల్లిలో ప్రెస్‌క్లబ్ ప్రారంభం

**కన్నెపల్లి, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రంలో నూతనంగా కన్నెపల్లి మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యాలయాన్ని విజయదశమి పండుగ సందర్భంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు చెండే సత్యానారాయణ జర్నలిస్టులతో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని పత్రిక విలేకరులకు ప్రజా సమస్యలను వెతికి తీస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పోనగంటి స్వామి, ఉపాధ్యక్షులు నందిపేట శ్రీనివాస్, కోశాధికారి జిల్లెల శ్రీకాంత్ గౌడ్, సహాయ కార్యదర్శి గట్టు ప్రసాద్ గౌడ్, ప్రచార కార్యదర్శి అయిల్ల వెంకటేష్, కార్యవర్గ సభ్యులు కూశన శ్రీనివాస్ పాల్గొన్నారు.




# మీ అభిమానం ఎల్లప్పుడూ ఇలాగే ఉండాలి

## ముఖరా (కే) మహిళలపై కేటీఆర్ ప్రశంసలు



**ఇచ్చోడ, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లాలోని ముఖరా (కే) గ్రామానికి చెందిన మహిళలు బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై మరోసారి తమ అభిమానాన్ని చాటుకున్నారు. దుర్గాదేవి నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన శోభాయాత్రలో కేసీఆర్ పాటలకు స్టెప్పులేస్తూ.. ఈ రాష్ట్రానికి కేసీఆర్ మరోసారి సీఎం కావాలనే ఆకాంక్షను చాటిచెప్పారు. ముఖరా (కే) మహిళల నృత్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. దిస్ ఈజ్ సూపర్బ్ అంటూ ముఖరా (కే) గ్రామ మహిళలపై ప్రశంసల జల్లు కురిపించారు కేటీఆర్. అద్భుతం.. మీ అభిమానం ఎల్లప్పుడూ ఇలాగే ఉండాలని కేటీఆర్ చప్పట్లతో అభినందించారు. దుర్గాదేవి శోభాయాత్రలో భాగంగా కేసీఆర్, కేటీఆర్ ఫొటోలను కూడా వారు ప్రదర్శించారు. సారే రావాలంటనున్నారు.. కారే కావాలంటున్నారు, దేఖ్లేంగే, రామక్క పాటలకు మహిళలు అద్భుతమైన స్టెప్పులేసి తమఅభిమానాన్ని చాటుకున్నారు. కేసీఆర్ పాటలతో ముఖరా (కే) గ్రామం దద్దరిల్లిపోయింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి, మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్, గ్రామ మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# సిర్పూర్ (టి)లో పులి సంచారం

**సిర్పూర్ (టి), అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ టీ అటవీ ప్రాంతంలో గురువారం పులి సంచరించింది. వివరాల్లోకి వెళితే.. సిర్పూర్ (టీ) మండలంలోని చీలపల్లి గ్రామానికి చెందిన ఏల్పుల తిరుపతి పెంచుకుంటున్న లేగదూడ రిజర్వ్‌ఫారెస్ట్‌లో మేతకు వెళ్లగా, పెద్దపులి దాడిలో అది మరణించింది. ఇక వెంటనే సమాచారం అందుకున్న ఎఫ్‌బీవో సంతోష్ సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి, విచారణ జరిపి, నష్టపరిహారానికై ఉన్నతాధికారులకు సిఫార్సు చేయడం జరిగింది. కాగా సిర్పూర్ రేంజ్‌లోని అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తుందని, గ్రామస్తులు జాగ్రత్త వహించవలసిందిగా ఎఫ్ఆర్వో ప్రవీణ్ కుమార్ తెలిపారు. పెద్దపులి జాడ తెలిసినట్లయితే సమాచారం అందించాలన్నారు.



## ఒడిశా నైనీ నుంచి తమిళనాడు జెన్‌కోకు

# 2.88 మిలియన్ టన్నుల బొగ్గు సరఫరా

- సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ నాయక్
- సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్‌తో తమిళనాడు జెన్‌కో ఎండీ ఎం.గోవిందరావు చర్చలు
- 10 రోజుల్లో పూర్తి కానున్న సరఫరా ఒప్పందం
- నైనీ బొగ్గుకు మొదటి వినియోగదారుగా చెన్నై..



**మంచిర్యాల, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
సింగరేణి సంస్థ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ నుంచి తమిళనాడు పవర్ జనరేషన్ కార్పోరేషన్‌కు బొగ్గును సరఫరా చేసేందుకు సర్వం సిద్ధమైంది. ఈ బ్లాక్ నుంచి ఏటా 2.88 మిలియన్ టన్నుల బొగ్గు సరఫరాకు తమిళనాడు జెన్ కో తో సింగరేణి సంస్థ మరో 10 రోజుల్లో ఇంధన సరఫరా ఒప్పందం చేసుకోనుంది. శుక్రవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో తమిళనాడు పవర్ జనరేషన్ కార్పోరేషన్ ఎండీ ఎం.గోవిందరావు. సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ ను కలిసి చర్చలు జరిపారు. తమిళనాడులోని తుత్తుకూడి జిల్లా ఉడింగిడిలో ఉన్న 1200 మెగా వాట్ల విద్యుత్ ప్లాంట్ కోసం ప్రతీ ఏడాది 2.88 మిలియన్ టన్నుల జీ-11 బొగ్గు అవసరముందని తమిళనాడు జెన్‌కో ఎండీ ఎం.గోవిందరావు పేర్కొన్నారు. సింగరేణి నుంచి ఈ బొగ్గును సరఫరా చేయాల్సిందిగా కోరారు. దీనిపై సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ స్పందిస్తూ.. ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ నుంచి ఉత్పత్తి ప్రారంభమైన నేపథ్యంలో రైలు, జల మార్గంలో సరఫరా చేసేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు బొగ్గు సరఫరాకు ఏర్పాట్లు చేయాల్సిందిగా నైనీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదే సమయంలో తమిళనాడు జెన్‌కోతో మరో 10 రోజుల్లో ఇంధన సరఫరా ఒప్పందం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాల్సిందిగా బొగ్గు రవాణా, మార్కెటింగ్ శాఖ అధికారులకు స్పష్టం చేశారు. సింగరేణితో తమిళనాడు జెన్ కోకు ఉన్న దీర్ఘ కాలిక బంధాన్ని మరింత బలపరిచేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని ఈ సందర్భంగా సీఎండీ ఎన్.బలరామ్, తమిళనాడు జెన్ కో ఎండీ ఎం.గోవిందరావు పేర్కొన్నారు. ఇప్పటికే సింగరేణి ద్వారా తమిళనాడు లోని నార్త్ చెన్నై విద్యుత్ ప్లాంట్కు ప్రతీ ఏడాది 1.75 మిలియన్ టన్నుల బొగ్గు సరఫరా జరుగుతోంది. తాజాగా ఒడిశాలోని నైనీ ప్రాజెక్టు నుంచి ఏడాదికి 2.88 మిలియన్ టన్నుల బొగ్గు సరఫరాకు అంగీకారం కుదిరింది. ఈ నేపథ్యంలో నైనీ బొగ్గుకు మొదటి వినియోగదారుగా తమిళనాడు నిలవనుండటం విశేషం. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.వెంకన్న, జీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## గాంధీ ప్రపంచానికి ఆదర్శం

### నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**నిర్మల్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మహాత్మా గాంధీ దేశ స్వాతంత్ర్యం కోసం జీవితాంతం పోరాడిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. యావత్తు దేశాన్ని మొత్తం స్వాతంత్ర్య సంగ్రామంలో సంఘటితం చేసి ముందుండి శాంతి, అహింస మార్గాలలో నడిపించారని అన్నారు. గాంధీజీ జీవితాన్ని అందరం స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం గాంధీ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని గాంధీ పార్కులోని మహాత్మా గాంధీ విగ్రహానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ జయంతి వేడుకలలో ఆర్డీవో రత్న కళ్యాణి, కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి సూర్యారావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ చూపిన అహింస మార్గం స్ఫూర్తిదాయకం

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
స్వాతంత్ర ఉద్యమంలో మహాత్మా గాంధీ చూపిన అహింసా మార్గం స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం గాంధీ జయంతిని పురస్కరించుకుని జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వేడుకలలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి హాజరై గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర ఉద్యమంలో అహింస, శాంతి మార్గాలతో ఉద్యమించి స్వాతంత్రాన్ని సాధించారని తెలిపారు. మహాత్మ ఆచరించి చూపిన అహింస, శాంతి, సత్యం మార్గాలు అందరికీ ఆచరణీయమని తెలిపారు. మహాత్మా గాంధీ ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని, సమాజ సేవ చేసేందుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రతిభ కనబపరిచిన నటరాజ కళాక్షేత్రం విద్యార్థులు



**జన్నారం, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రానికి చెందిన నటరాజ కళాక్షేత్రం విద్యార్థులు తమ ప్రతిభను మరోసారి నిరూపించారు. ఈ కళాక్షేత్రానికి చెందిన విద్యార్థులు సహస్ర గౌడ్, యశోద వర్షిణి, యశోద మోక్షిత్ లు ఈటీవీ నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మకమైన ఢీ 20 రియాల్టీ డాన్స్ షోలో ఎంపికై అద్భుతమైన నృత్య ప్రదర్శన అందించారు. వారి ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించడమే కాకుండా న్యాయ నిర్ణేతల ప్రశంసలు పొందాయి. చిన్న వయసులోనే పెద్ద వేదికపై నిలబడి తమ ప్రతిభను చాటుకోవడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా డ్యాన్స్ మాస్టర్ నర్మద గౌడ్ మాట్లాడుతూ మా విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేస్తూ ఈ స్థాయికి చేరుకున్నారు. జన్నారం నుంచి దేశ స్థాయిలో తమ ప్రతిభ చాటుకోవడం గర్వకారణంగా ఉందని.. భవిష్యత్తులో మరింత ఉన్నత వేదికలపై నిలబడతారని నమ్మకం ఉంది అని పేర్కొన్నారు.



## శిథిలావస్థలో కల్వర్టు

### పట్టించుకోని మున్సిపల్ సిబ్బంది

**చెన్నూర్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని 9వ వార్డులో సాయిబాబా మందిరం వద్ద ఉన్న కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. ఏసమయాన కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. మున్సిపల్ సిబ్బంది పట్టించుకోవడం లేదని వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వినాయక చవితి నిమజ్జనం సందర్భంగా మున్సిపల్ కమిషనర్‌కు వార్డు ప్రజలు సమస్యను వివరించగా తూతూ మంత్రంగా మరమ్మతులు చేయించి చేతులు దులుపుకున్నాడని వార్డు ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రతి రోజు సాయిబాబా, సోమేశ్వర, శివాలయాలకుభక్తులు ఈ దారి గుండానే వెళుతుంటారు. ముఖ్యంగా వాహనాలు అధిక సంఖ్యలో వెళ్తుండటంతో కల్వర్టు శిథిలావస్థకు చేరుకొని వాహనాలు వెళుతున్న సమయంలో వాహనాలు షేక్ అవుతుండటం గమనార్హం. అసలు ఏ సమయంలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఆయన మున్సిపల్ సిబ్బంది నూతన కల్వర్టు చేపట్టే విధంగా చర్యలు తీసుకోకపోవడం ముఖ్యంగా ఈ వార్డులోని సమస్యలను పట్టించుకోకపోవడం వెనుక అంతర్యం ఏంటని..? వార్డ్ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దుర్గామాత నిమజ్జనం సందర్భంగా పెద్ద సంఖ్యలో విగ్రహాల ర్యాలీ ఈ దారి గుండా వెళుతుంటాయని విగ్రహాలను తీసుకు వెళ్తున్న క్రమంలో ఏదైనా అనుకోని సంఘటనలు జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని దుర్గామాతల మండపాల నిర్వహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌన్సిలర్ల పదవీకాలం పూర్తయినప్పటి నుండి 9వ వార్డులో పరిశుభ్రతపై పట్టింపు లేకపోవడం, పరిశుభ్రతపై వార్డ్ ప్రజలు ఇప్పటివరకు జిల్లా కలెక్టర్కు కూడా ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ ఏ విధమైన చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే కల్వర్టు శిథిలావస్థకు చేరినప్పటికీ కమిషనర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వెనుక అధికార పార్టీ నాయకుల గ్రూపు తగాదాలు కూడా కారణమేమోనని అని వార్డ్ ప్రజలు గుసగుసలాడుతున్నారు. ఏది ఏమైనాప్పటికీ మున్సిపల్ సిబ్బంది కల్వర్టు పూర్తిగా కూలిపోక ముందే నూతన కల్వర్టు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వార్డు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## రిజర్వేషన్ ఎఫెక్ట్.. ఎంపీటీసీ అభ్యర్థులు కరువు

**తాంసి, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
ఊహించని విధంగా రిజర్వేషన్లు ఖరారు కావడంతో స్థానిక సంస్థల ఎన్నికల పోటీకి అభ్యర్థులు కరువయ్యారు. తాంసి మండలంలోని వడ్డాడి ఎంపీటీసీ నియోజకవర్గ స్థానానికి ఎస్టీ రిజర్వేషన్ ఖరారు కావడంతో ఆ ఎంపీటీసీ నియోజకవర్గ పరిధిలోని వడ్డాడి, జామిడి, పాలోడీ గ్రామ పంచాయతీలలో ఎస్టీ జనాభా అంతంత మాత్రమే ఉన్నప్పటికీ కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు పోటీ చేసే వారు కరువయ్యారు. దీంతో ఆయా పార్టీల నేతలు పోటీ చేసే అభ్యర్థుల కోసం వేట మొదలెట్టారు.

**పక్క గ్రామాల వారే దిక్కు..**
వడ్డాడి ఎంపీటీసీ స్థానానికి ఎస్టీ అభ్యర్థి బలమైన వారు, పోటీకి ముందుకు వచ్చే వారు లేకపోవడంతో రాజకీయ పార్టీలు సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక ఎంపీటీసీ నియోజకవర్గంలో పోటీకి సుముఖత ఎవరు రాకపోవడంతో కాంగ్రెస్, బీజేపీ పార్టీల నుంచి తాంసీ మండల కేంద్రానికి వారిని బరిలోకి దింపుతున్నట్టు సమాచారం. అదేవిధంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు సమావేశంలో చర్చించగా పొన్నారి గ్రామానికి చెందిన వారిని బరిలో నిలుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

**ముగ్గురు స్థానికేతరులు పట్టు సాధిస్తారా..?**
వడ్డాడి ఎంపీటీసీ స్థానం నుంచి ముగ్గురు స్థానికేతరులే బరిలోకి దిగుతున్నారనే ప్రచారం ఒక వైపు జోరందుకోగా ఆ ఎంపీటీసీ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఆయా పార్టీలకు చెందిన స్థానిక నాయకులలో ఎన్నికల కోలాహలం అంతగా ఉండకపోవచ్చు అనేది వ్యక్తం అవుతోంది. ముగ్గురు స్థానికేతరులే కావడంతో ఎవరు పట్టు సాధిస్తారో.. ప్రజలు ఎవరికి పట్టం కడతారో చూడాలి మరి.



**బండల్ నాగపూర్ ఎంపీటీసీ అభ్యర్థి అదే పరిస్థితి..**
తాంసి మండలంలోని బండల్ నాగపూర్ ఎంపీటీసీ స్థానానికి ఎస్సీ రిజర్వేషన్ ఖరారు కావడంతో ఆ ఎంపీటీసీ నియోజకవర్గ పరిధిలో బండల్ నాగపూర్, సవర్గమ, గోట్కూరి గ్రామ పంచాయతీలు ఉండగా అక్కడ సైతం పోటీ చేసే అభ్యర్థులు దొరకడం కష్ట తరంగ మారింది. బీఆర్ఎస్ పార్టీ నుంచి దాదాపు సవర్గమకు చెందిన ఒకరిని బరిలో దింపుతున్నట్టు ప్రచారం జోరందుకుంది. అయితే బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు అభ్యర్థులు బరిలో నిలిచేందుకు ఎవరు ముందుకు రాకపోవడంతో ఎవరిని అభ్యర్థిగా ఖరారు చేయాలని సమాలోచనలో పడ్డారు.

# 'దసరా' విజయాలు చేకూర్చాలి

## మందమర్రి పట్టణంలో దసరా వేడుకల్లో పాల్గొన్న మంత్రి వివేక్

**మందమర్రి, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా మందమర్రి సింగరేణి పాఠశాల మైదానంలో స్థానిక సింగరేణి జీఎం రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి హాజరై వేడుకలను ప్రారంభించారు. అనంతరం విశాఖపట్నం నుంచి ప్రత్యేకంగా తెప్పించిన బాణా సంచా పేలుళ్లు ఉర్రూతలూగించాయి. వేలాదిగా తరలివచ్చిన ప్రజల కేరింతల నడుమ రావణ దహనం చేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరేణి ప్రాంతంలోని కళాకారులు చేసిన నృత్యాలు అలరించాయి. స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయంలోని మండపంలో ఏర్పాటు చేసిన కనకదుర్గను దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో వాసిరెడ్డి సీతారామయ్య,



సలేంద్ర సత్యనారాయణ, విజయ ప్రసాద్, శ్యామ్ సుందర్, భీమరాజు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

**దసరా పండుగ రోజు బతుకమ్మ వేడుకలు...**
దసరా పండుగను పురస్కరించుకొని మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం పొన్నారం గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ప్రతి ఏటా దసరా పండుగ రోజున బతుకమ్మ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ క్రమంలో సంప్రదాయ వస్త్రాలు ధరించిన మహిళలు, యువతులు వివిధ పూలతో అలంకరించిన బతుకమ్మలను ఒక చోటకు చేర్చారు. అనంతరం డీజే పాటలు కాకుండా సంప్రదాయ పాటలకు చప్పట్లు కొడుతూ గౌరమ్మ కొలిచారు. అనంతరం పోయిరావమ్మా బతుకమ్మ అంటూ సమీప చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ దసరా అందరికి విజయాలు చేకూర్చాలని అన్నారు. విజయదశమి సుఖసంతోషాలు కలిగించాలంటూ దసరా శుభాకాంక్షలు తెలిపారు.



# కాసిపేటలో దసరా వేడుకలు

**కాసిపేట, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని ముత్యంపల్లి, కాసిపేట గ్రామాల్లో గురువారం సాయంత్రం మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా దసరా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామాల మున్నూరు కాపు కుల బాంధవులు అంతా కలిసి కట్టుగా వెళ్లి జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. ఒకరికొకరు జమ్మి పంచుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ దసరా పండుగ అందరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలుకలుగుజేయాలని కోరుకున్నారు.

# ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకోవాలి

**నార్నూర్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకోవాలని ఆదిలాబాద్ జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ గ్రామంలో దుర్గామాతకు దంపతులతో కలిసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవ రాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నియమ నిష్ఠతలతో జరుపుకోవడం హర్షనీయమన్నారు. ఆధ్యాత్మికతతో మనస్సుకు ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు విష్ణు, రాథోడ్ రాజు, మాజీ ఎంపీటీసీ జాదవ్ అరుణ దిలీప్, ఆయా శాఖల అధికారులు, గ్రామ పెద్దలున్నారు.



# బెల్లంపల్లిలో ఘనంగా దసరా వేడుకలు

## క్యాంపు కార్యాలయంలో పూజలు చేసిన ఎమ్మెల్యే

**బెల్లంపల్లి, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి పట్టణంలో గురువారం దసరా ఉత్సవాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వివిధ వార్డులలో, బస్తీలలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాల వద్ద భక్తిశ్రద్ధలతో పూజ నిర్వహించారు. పలు ఆలయాలు భక్తులతో రద్దీగా దర్శనమిచ్చాయి. షమీ పూజ అనంతరం దేవాలయాలు, దుర్గామాత మండపాలలో ఆయుధ, వాహన పూజలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీ కోదండ రామాలయంలో శరన్నవరాత్రుల సందర్భంగా దుర్గాదేవికి ప్రత్యేక పూజలు జరిపి పట్టణంలో కన్నుల పండుగగా రథోత్సవాన్ని నిర్వహించారు. బెల్లంపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ జ



మ్మి చెట్టుకు షమీ పూజ నిర్వహించారు. హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో బెల్లంపల్లి తిలక్ క్రీడా మైదానంలో అశేష జనవాహిని మధ్య రావణాసుర వద కార్యక్రమాన్ని చేపట్టారు.

# ఆదివాసీలను అడ్డుకున్న అటవీ అధికారులు



**కోటపల్లి, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
మండలంలో పట్టు పురుగుల పెంపకం అటు ఆదివాసీలకు, ఇటు అటవీ అధికారుల మధ్య వివాదానికి తెర లేపింది. అటవీ ప్రాంతంలో పట్టు పురుగులను పెంచవద్దని, పట్టు పురుగుల పెంపకం నిషేధం అంటూ అటవీ అధికారులు ఆంక్షలు విధించడంతో పట్టుసాగుదారులు ఆందోళన నిర్వహించారు. రెండు రోజుల క్రితం పట్టు సాగుదారులను కావర కొత్తపల్లి అటవీ ప్రాంతంలోకి అటవీ అధికారులు రాకుండా అడ్డుకోవడంతో ఇది క్రమ క్రమంగా ఆందో ళనలకు దారి తీసింది. దీంతో రెండు రోజుల క్రితం ఆందోళన నిర్వహించిన పట్టు పురుగుల పెంపకందారులు చెన్నూరుకు వెళ్లి ఎఫ్‌డీవో కార్యాలయంలో వినతి పత్రం అందించారు. అయినా అటవీ అధికారుల్లో మార్పు రాకపోగా శుక్రవారం మరోసారి పట్టు పురుగు పెంపకందారులు ఆందోళన చేపట్టారు. పట్టు పురుగు పెంపకందారులు శుక్రవారం అటవీ ప్రాంతానికి వెళ్లగా అటవీ అధికారులు మరోసారి అడ్డుకోవడంతో పాటు ఈ ప్రాంతంలోకి రావద్దని, ఇక్కడ పట్టు పురుగుల పెంపకం నిషేధం అంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. దీంతో ఆదివాసీ సంఘం నాయకుడు శేఖర్ ఆధ్వర్యంలో పట్టు పురుగు పెంపకం దారులు అటవీ ప్రాంతంలో ధర్నా చేపట్టారు. మండలంలోని రాజారం, కావర కొత్తపల్లి, అర్జునగుట్ట, ఏదులబంధం గ్రామాలకు చెందిన 750 కుటుంబాలు పట్టు పురుగుల పెంపకంపైనే జీవనాధారం సాగిస్తున్నాయని, ఆరు దశాబ్దాలుగా అటవీ ప్రాంతంలోని నల్లమద్ది చెట్లపైపట్టు పురుగుల పెంపకం చేపడుతున్నామని, ఇక్కడి పట్టు పరిశ్రమకు రాష్ట్ర స్థాయిలోనే గుర్తింపు ఉందని, ప్రస్తుతం అటవీ అధికారులు అడ్డుకోవడంతో తమపరిస్థితి ఏమిటని బాధిత కుటుంబాల ప్రజలు వాపో యారు. తాము అటవీ ప్రాంతాన్ని ఆక్రమించుకోవడం లేదని, గుంట భూమి కూడా అటవీ ప్రాంతం భూమి పొందలేదని, అటవీ ప్రాంతంలో ఉన్న నల్లమద్ది చెట్లపైనే పట్టు పురుగుల పెంపకం చేపడుతున్నామన్నారు. తాము అడవికి ఎలాంటి హానీ చేకూర్చడం లేదని బాధితులు వాపోయారు. సుమారు 2 గంటల పాటు ధర్నా నిర్వహించగా ఎఫ్ఆర్‌వో సదానందం ఈ ప్రాంతానికి చేరుకుని బాధితులతో చర్చలు జరిపారు. అయినా సఫలం కాకపోగా ఆదివాసీ సంఘం నాయకులను చెన్నూరు అటవీ శాఖ కార్యాలయానికి రావాలని సమస్యలుంటే పరిష్కరించుకుందామని అటవీ అధికారులు చెప్పడంతో ఆందోళన సద్దుమణిగింది. అటవీ శాఖ పట్టు పురుగుల పెంపకాన్ని అడ్డుకుంటే తాము ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు.




# జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

## ఏఎస్పీ చిత్తరంజన్

**ఆసిఫాబాద్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అదేశాల మేరకు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణే ధ్యేయంగా ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా పోలీస్ శాఖ నిరంతర పని చేస్తుందని ఏఎస్పీ చిత్తారంజన్ తెలిపారు. ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో నూతన ట్రాఫిక్ ఎస్సై చంద్ర శేఖర్‌ను నియమించినట్లు సిఐ బాలాజీ వరప్రసాద్ వివరించారు. ట్రాఫిక్ ఎస్ఐతో పాటు ఇద్దరు హెడ్ కానిస్టేబుల్, ముగ్గురు ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది నియంత్రణలో పని చేస్తారన్నారని, పట్టణంలోనీ ప్రధాన కూడళ్లు అయిన బస్టాండ్, కేబీ చౌక్, ప్రభుత్వ ఆసుపత్రి చౌరస్తాతో పాటు గాంధీ, వివేకానంద చౌరస్తాలో ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ వ్యవహారాలు వంటివి నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టనున్నట్లు ఏఎస్పీ పేర్కొన్నారు.

# రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

## కాసిపేట-1 ఇంక్లైన్‌లో నూతన పనులను ప్రారంభించిన జీఎం రాధాకృష్ణ

**కాసిపేట, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
కాసిపేట-1 ఇంక్లైన్‌లో నూతనంగా 4-ఎస్ 13, 3ఎస్-13 అండర్ గ్రౌండ్లలో నూతన పనులకు అనుమతులు రావడంతో శుక్రవారం మందమర్రి జిఎం ఎన్.రాధాకృష్ణ పనులను ప్రారంభించారు. సంస్థ నిర్దేశించిన లక్షణం సాధించడానికి ఉద్యోగులు, అధికారులు కృషి చేయాలని కోరారు. రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించి సంస్థకు గుర్తింపు తీసుకురావాలన్నారు. కాసిపేట గని ఎన్నో రికార్డులను సృష్టించిందని, మళ్లీ పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి గని ఉద్యోగులు పనిచేయాలన్నారు. క్రమశిక్షణకు కాసిపేట ఉద్యోగులు ప్రతీకగా నిలిచారని కొనియాడారు. సరైన పనిముట్లను ఉపయోగించి నైపుణ్యతతో పనిచేయాలని సూచించారు. ఉద్యోగులలో గైర్హాజర్ శాతం ఎక్కువగా ఉందని విధులను నిర్వర్తించి సంస్థకు అండగా నిలవాలని కోరారు.



# పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో విజయ దశమి వేడుకలు

**ఆసిఫాబాద్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో ఆయుధ పూజ,వాహన పూజ, షమీ వృక్షం పూజలు వైభవంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఏఎస్పీ చిత్తరంజన్ లతో కలిసి పాల్గొన్నారు. అనంతరం దుర్గాదేవికి కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... విజయదశమి జిల్లా ప్రజలకు విజయం చేకూర్చాలని, సుఖ సంతోషాలను అందించాలని ఆకాక్షించారు. సిబ్బందితో కలిసి దసరా శుభాకాంక్షలు తెలుపుతూ ఆకాంక్షించారు. శాంతి భద్రతల పరిరక్షణలో నిత్యం అప్రమత్తంగా ఉండే పోలీసులు తమ విధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాలను, వాహనాలను దైవ స్వరూపంగా భావించి ప్రత్యేక పూజలు నిర్వహించడం సాంప్రదాయంగా వస్తుందని అన్నారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి దసరా శుభాకాంక్షలు తెలుపుతూ అలాయ్ బలయ్ నిర్వహిస్తూ ఆనందించారు. కార్యక్రమంలో పోలీసు శాఖ సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# కుమ్రంభీం జిల్లాలో వైభవంగా దసరా వేడుకలు

**ఆసిఫాబాద్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో గురువారం దసరా సంబరాలు వైభవంగా నిర్వహించారు. ఆసిపాబాద్ మండలంలో గురువారం దసరా వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రజలు ఆయా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి పెద్దవాగు సమీపంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో అర్చకులు మధుకర్ శర్మ, మహేష్ శర్మ, శ్రీనివాస్ శర్మల ఆధ్వర్యంలో జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వమించారు. రావాణసూరుడి దిష్టి బొమ్మ దహన కార్యక్రమంను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన లక్కీ ద్వారా యువ రచయిత రాధాకృష్ణ రావాణ దాహన కార్యక్రమానికి ఎంపికయ్యారు. రాత్రి 7.30 గంటలకు రావణాసూరుడి దిష్టిబొమ్మ దహన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ట్రాఫిక్‌కు సిబ్బందులు లేకుండా సీఐ బాలాజీ వంప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందో బస్తు ఏర్పాటు చేశారు. దసరా పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, బీజేపీ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ బాలేష్‌గౌడ్, బుల్లితెర దర్శకుడు నిర్మాత నాగబాల సురేష్ కుమార్, బీజేపీ నాయకులు విశాల్, కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, వివేక్, వెంకన్న, శ్రీనివాస్, రమేష్, మధు, లక్ష్మణ్‌మూర్తి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకన్న, మల్లేష్ తదితరుల పాల్గొన్నారు. ఘనంగా దసరా వేడుకలు కాగజ్‌నగర్ పట్టణంలో గురువారం దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం నుంచి తమ వాహనాలకు పూజలు చేశారు. స్థానిక త్రిశూల్ పహాడ్‌పై వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే హరీష





బాబు షమీపూజ చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రాత్రి రావాణసురుడి ప్రతిమకు దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే హరీష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పతో పాటు ఆయాపార్టీల నాయకులు పట్టణ వాసులకు ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కూడా తమ అభిమానులు, కార్యకర్తలను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వాంకిడి మండలంలో ప్రజలు ఘణంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వాహనాలను శుభ్రంగా కడిగి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం మండల కేంద్రానికి సమీపంలో గల జమ్మి చెట్టుకు ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించి ఒకరికొకరు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సై మహేందర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బెజ్జూరు మండలంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దహెగాం మండలంలో శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దహెగాం పోలీసు స్టేషన్‌లో ఆయుధ పూజ నిర్వహంచారు. కెరమెరి మండల వ్యాప్తంగా దసరా వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. రావణాసురుడి దిష్టిబొమ్మను దహనం చేశారు. రెబ్బెన మండలంలోని చారిత్రాత్మక ప్రదేశమైన గంగాపూర్ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయం, రెబ్బెన ఎల్లమ్మ గుడి, గోలేటి భీమన్న స్టేడియంలలో జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జమ్మి ఆకును తెంపుకొని ఒరికొకరు ఇంచిప్పుచుకుంటూ పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్క ర్‌రెడ్డి, రెబ్బెన సీఐ సంజయ్, ఎస్సై వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు. సిర్పూర్(టి) మండలం గురువారం దసరా సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే బాలాజీ వేంకటేశ్వరస్వామి వద్ద రథంకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాజా భజంత్రీల మధ్య పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. సీఐ సంతోష్ కుమార్, ఎస్సై సురేష్‌ల ఆధ్వర్యంలో బందో బస్తు నిర్వహించారు. పెంచికలపేట మండలంలోని ఆలయాల్లో దసరా సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## క్యాన్సర్‌పై అవగాహన ఉండాలి

**లక్షెట్టిపేట, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
మహిళలందరికీ బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన అవసరమని గాంధీ మెడికల్ కాలేజీలో నాలుగో సంవత్సరం చదువుతున్న ఇండ్ల లిఖిత శ్రీ అన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో మండలానికి చెందిన మేడికోలు నిర్వహించిన క్యాన్సర్ అవగాహన సదస్సులో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మహిళలు తమకు అవగాహన లేకుండా క్యాన్సర్ బారిన పడుతున్నారని వారికి అవగాహన కల్పించడం ప్రతి ఒక్కరి విధి అని సూచించారు. క్యాన్సర్ రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను ఆమె వివరించారు. ప్రతి 40 సంవత్సరాలు దాటిన మహిళ బ్రెస్ట్ క్యాన్సర్‌కు సంబంధించిన టెస్టులు చేయించుకోవాలని ఆమె సూచించారు. అవగాహన సదస్సులో మండలానికి చెందిన మెడికోలు సంగ రవితేజ, సాయి దీపక్ వర్మ, విఖ్యాత్ తదితరులు పాల్గొన్నారు.


## సబ్ కలెక్టర్‌కు సన్మానం



**నిర్మల్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
గ్రూపు-1 ఫలితాలలో ఉత్తమ ప్రతిభా కనబరచి ఆసిఫాబాద్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించబడిన నిర్మల్‌కు చెందిన జి.జే. జోయల్‌ను ఆయన నివాసంలో కలిసి ఎస్టీయుటీఎస్ నిర్మల్ జిల్లా శాఖ పక్షానశుభాకాంక్షలు తెలియజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జుట్టు గజేందర్ మాట్లాడుతూ, ఎక్కడ పనిచేసిన ఉపాధ్యాయుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎస్. భూమన్న, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ పాల్గొన్నారు.

## ఘనంగా విజయదశమి వేడుకలు

**నార్నూర్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లా నార్నూర్, గాదిగూడ మండలాలలో విజయదశమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఆదివాసి గుడేలలో రైతులు వ్యవసాయ సామగ్రి లకు ప్రత్యేక పూజలు చేశారు. వాహనదా రులు తమ వాహనాలకు పూజలు నిర్వహించారు. అలాగే నార్నూర్ మండల కేంద్రంలోని శ్రీ ఖాందేవ్ ఆలయంలో తొడసం వంశీయుల ఆధ్వర్యంలో ఖాందేవ్ ప్రతిమలకు సాంప్రదాయ పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. దసరా వేడుకను పురస్కరించుకొని ఖాందేవ్ పుణ్యక్షేత్రంలో పూజలు నిర్వహించడం ఆనాదిగా వస్తున్న ఆచారమని ఆ వంశం పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ వైస్ మాజీ చైర్మన్ తోడసం నాగోరావ్, మాజీ ఎంపీపీ మెస్రం రూప్ దేవ్, రాజు పటేల్, మూతిరం పటేల్, భీంరావ్ పటేల్, అంబాజీ పటేల్, కాటోడ బాపురావు, తెలంగ్ రావు, యాదవ్ రావు, శంభు, ఆనంద్, రామారావు, భీం రావు తదితరులున్నారు.



## కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం : జీఎం విజయభాస్కర్



**తాండూర్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
కార్మికుల సంక్షేమం కోసం సింగరేణి యాజమాన్యం పెద్దపీట వేస్తుందని గోలేటి ఏరియా జనరల్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి అన్నారు. తాండూర్ మండలం సింగరేణి ప్రాంతం మాదారం టౌన్ షిప్ మినీ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన దసరా ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేద పండితులు అవధూత శర్మ ఆధ్వర్యంలో జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించగా జీఎం దంపతులు పూజలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం కార్మికుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. బెల్లంపల్లి ఏరియాకు మళ్లీ మంచి రోజులు వచ్చి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. టౌన్‌షిప్‌లో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి, ఐఎన్టీయూసీ ఏరియా ఉపాధ్యక్షులు పేరం శ్రీనివాస్ , అడ్‌హాక్ కమిటీ సభ్యులు ఓదేలు, రఘునాథ్ రెడ్డి, సంపత్ రెడ్డి, దామోదర్ రెడ్డి, మల్లేష్ జీఎంకు స్వాగతం పలికారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మాదారం ఎస్సై సౌజన్య బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఘనంగా దుర్గామాత నిమజ్జన వేడుకలు

**మందమర్రి, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
మందమర్రి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ప్రతిష్టించి శరన్నవరాత్రి వేడుకల్లో పూజలందుకున్న అమ్మ వారు శుక్రవారం అంగరంగ వైభవంగా నిమజ్జనం నిర్వహించారు. అంతకు ముందు ఆయా మండపాల ఆధ్వర్యంలో నిర్వాహకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించా రు. ఈ సందర్భంగా నవరాత్రులు పూజలందుకున్న అమ్మ వారి చీరలు, కలశాలకు వేలం పాటలు నిర్వహించగా భక్తులు పోటాపోటీగా వేలం పాటలో పాల్గొని అమ్మవారి పూజ సామాగ్రిని దక్కించుకున్నారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలలో అమ్మవారిని నిమజ్జనానికి తరలించారు. నిమజ్జన శోభాయాత్ర పలువురిని ఆకట్టుకుంది. శ్రీశ్రీశ్రీ వరసిద్ధి వినాయక మండలి ఆధ్వర్యంలో పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ సమీపంలో శ్రీశ్రీశ్రీ వరసిద్ధి వినాయక మండలి ఆధ్వర్యంలో దుర్గ మాతను ప్రతిష్టించి నవరాత్రులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రులలో చివరి ఘట్టం అమ్మ వారి నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించారు.



అమ్మవారి నిమజ్జన ఊరేగింపు సందర్భంగా మహిళలు కోలాటాలు, చిన్నారుల నృత్యాల నడుమ కన్నుల పండుగగా సాగింది. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



### బుద్ధ విహార్‌లో
## ధర్మ పరివర్తన దినోత్సవం

**నిర్మల్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ పట్టణంలోని బుద్ధ విహార్ ట్రస్ట్ కార్యాలయంలో శుక్రవారం ధర్మచక్ర పరివర్తన దినోత్సవం నిర్వహించారు. బుద్ధుని విగ్రహానికి పూజలు నిర్వహించి బౌద్ధ ధర్మ యొక్క వ్యాప్తికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. బుద్ధుని బోధనలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో నిర్వాకులు వెంకటస్వామి, ప్రభాకర్, రాములు రమేష్, లక్ష్మణ్, రవీందర్, క్రాంతి పాల్గొన్నారు.

## ధమ్మ చక్ర పరివర్తన్ దివస్

**నార్నూర్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
నార్నూర్, గాదిగూడ మండలాల్లో బహుజనులు ధమ్మ చక్ర పరివర్తన్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. దళిత వాడల్లో అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. గౌతమ బుద్ధునికి ప్రత్యేక పూజలు చేశారు. పంచశీల జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ మాట్లాడుతూ నేటి తరం యువత మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలన్నారు. మహనీయుల సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని కోరారు.





### గాంధీజీ స్వాతంత్ర్యం కోసం

## పోరాడిన గొప్ప నాయకుడు

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకర్ రావు

**ఆదిలాబాద్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆదిలాబాద్ జిల్లా జైలులో ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. మొదటగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకర్ రావు, జిల్లా పాలనాధికారి రాజర్షి షా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ గొప్ప నాయకుడు అని, స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. శాంతి, అహింస మార్గాల్లో నడిచి స్వాతంత్ర్యం సాధించారన్నారు. ఆయన బోధనలు ప్రపంచానికి స్ఫూర్తి దాయకమన్నారు. ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతూ.. క్షణికావేశంలో చేసిన తప్పులను సరిదిద్దుకోవాలని సూచించారు.

### కుమ్మర ఎంప్లాయిస్ వెల్ఫేర్

## అసోసియేషన్ కార్యవర్గం



**నిర్మల్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో శుక్రవారం కుమ్మర ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సాయన్న అధ్యక్షులుగా, శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శిగా, రాజేంద్రప్రసాద్ గౌరవ అధ్యక్షులుగా, సత్యనారాయణ కోశాధికారిగా ఎన్నికయ్యారు. కుమ్మర కులస్తులు విద్య, రాజకీయ రంగాల్లో ఎదగాలని, కుల వృత్తులు చేస్తున్న కుమ్మరులను బీసీ (ఏ)లో చేర్చాలని ఈ సందర్భంగ వారు డిమాండ్ చేశారు.

### రోడ్లపై పుట్టినరోజు

## వేడుకలు నిషేధం



**ఆదిలాబాద్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని డీఎస్పీ జీవన్ రెడ్డి శుక్రవారం తెలిపారు. 30 పోలీస్ యాక్ట్ ఉల్లంఘిస్తూ గత నెల 19వ తేదీన పుట్టినరోజు వేడుకలు నిర్వహించిన పట్టణానికి చెందిన మహాకాళి అజయ్ అనే నిందితుడిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. ప్రజలకు ఇబ్బందులు ఉంటే పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించాలని సూచించారు.

## ఆకతాయిలను పట్టుకున్న షీ టీం

**కాగజ్‌నగర్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
కాగజ్‌నగర్ సబ్ డివిజన్ త్రిశూల్ పహాడ్ ఏరియాలో రావణ దహనం చేసే సమయంలో అమ్మాయిలను ఆటపట్టించిన ఆరుగురు ఆకతాయిలను పట్టుకున్నట్లు షీ టీం ఇంచార్జీ ఏఎస్సై సునీత తెలిపారు.

# మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలి

### ఎమ్మెల్యే కోవ లక్ష్మి - 7న జోడేఘాట్‌లో ఆదివాసీ వీరులు కుమ్రంభీం, కుమ్రం సూరుల వర్ధంతి

**ఆసిఫాబాద్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
ఆదివాసీ హక్కుల సాధనలో మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. ఈ నెల 7న జోడేఘాట్‌లో జరగనున్న ఆదివాసీ వీరులు కుమ్రంభీం భీం, సూరుల వర్ధంతికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివాసీ నాయకులతో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహనీయులు చూపిన బాటలో నడుస్తూ హక్కు ల సాధనకు సమష్టిగా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో సొనేరావు, లాల్‌సావ్, ఉత్సవ కమిటీ చైర్మన్ పెందోర్ మోతిరం, మాజీ ఎంపీపీ తొడసం జగన్నాథ్,కమిటీ సభ్యులు భుత బాపురావు, మడవి రాజు, సూరు కమిటీ చైర్మన్ కుంరం మారుతీ, కన్వీనర్ సిడం ద్రము పాల్గొన్నారు.



## 5న ఎస్సారెస్పీ ముంపు బాధితుల సమావేశం

**ముథోల్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
శ్రీరాంసాగర్ ప్రాజెక్టుపైన ముంపు, వరదకు కారణాలపై చర్చించి, సమస్యను శాశ్వతంగా పరిష్కారం చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేసేందుకు బాధిత గ్రామాలు, రైతులు స్వచ్ఛందంగా తరలి రావాలని న్యాయవాది బి.మనోహర్ కోరారు. 5వ తేదీన నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండల కేంద్రంలోని రఘుపతి రెడ్డి కళ్యాణ మండపంలో మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో బోధన్, ముథోల్, ఆర్మూర్, నిర్మల్, బాన్సువాడ నియోజకవర్గంలోని వరద ముంపు గ్రామాల ప్రజలు, రైతులు రావాలని కోరారు. ముఖ్యంగా ఎస్సారెస్పీ ప్రాజెక్టుపైన ఉన్న గ్రామాలు, పంట పొలాలు ఎప్పుడులేని విధంగా ముంపునకు గురవుతున్నాయని, దీనిపై కారణాలను విశ్లేషణ చేసి సమస్య పరిష్కారానికి ఒక చర్చ చేయాలని కోరారు. వాస్తవాలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేద్దామన్నారు. తర్వాత ప్రజాప్రతినిధులు, అధికారులకు వాస్తవాలను తెలియజేస్తూ వినతి పత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వరద ముంపు బాధిత గ్రామాల ప్రజలు, రైతులు స్వచ్ఛందంగా తరలిరావాలని కోరారు.

**నష్ట పరిహారం కోరడం హక్కు...**
ఎప్పుడులేని విధంగా వరద రావడం, పంటలు ముంపునకు గురికావడం జరుగుతుందని, బాధితులు నష్ట పరిహారం కోరడం మన హక్కని మనోహర్ అన్నారు. స్థానికంగా జరిగిన తప్పిదలను గుర్తించడం జరిగిందని, వాస్తవాలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లాల్సిన ఉందన్నారు.

## ప్రజాపాలన ప్రభుత్వంలో పండుగ పూట పస్తులా




**ఆసిఫాబాద్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
ప్రజా ప్రభుత్వం అను చెప్పుకొచ్చే కాంగ్రెస్ ప్రజాపాలనలో కార్మికులు పస్తులుండే పరిస్థితి రావడం నిజంగా సిగ్గు చేటని సిఐటియూ ఉపాధ్యక్షుడు వెలిశాల కృష్ణమాచారి అన్నారు. కలెక్టరేట్ ఎదుట గిరిజన హాస్టల్స్ డైలీ వేజ్, ఔట్సోర్సింగ్ వర్కర్లు చేస్తున్న సమ్మె 21వ రోజుకు చేరింది. ఆకలితో అలమటిస్తున్నామన్న సంకేతం వచ్చేలా ఖాళీ ప్లేట్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడుపు కట్టునుని కూలి చేసిన కార్మికుల పొట్ట కొట్టి పండగ పూట పస్తులు ఉంచడం నిజంగా దేశంలో ఎక్కడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 7 నెలలుగా వేతనాలు రాక పూర్తిగా అప్పుల ఊబిలో కూరుకుపోయారని ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిశీలించాలని కోరారు. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సిఐటియు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలో హాస్టల్స్ డైలీ వేజ్ మరియు ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ సీఐటియు రాష్ట్ర అధ్యక్షుడు టేకం ప్రభాకర్, యూనియన్ జిల్లా అధ్యక్షుడు తొడసం వసంతరావు, ఉపాధ్యక్షులు కోటయ్య, కమల, శశికళ, పుష్ప, లక్ష్మి, శంకర్ తిరుపతి, సదాశివ్ హీరాభాయి, రమేష్, శివరాం యమునా, నాయకులు లత, తెలంగ్రావు, తదితరులు పాల్గొన్నారు.

## చెడును వీడి సన్మార్గంలో పయనిద్దాం

### మాజీ మంత్రి జోగు రామన్న

**ఆదిలాబాద్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్‌లో దసరా వేడుకలు సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సైతం ఘనంగా నిర్వహించారు. స్థానిక మల్టీపర్పస్ మైదానంలో నిర్వహించిన ఈ కార్యక్రమం లో మాజీ మంత్రి జోగు రామన్న, కాంగ్రెస్ పార్టీ నేత కంది శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, సామాజిక వేత్త మౌనిష్ రెడ్డి పాల్గొన్నారు. ముందుగా దుర్గామాత, భారతమాత, శ్రీ సీతారామ చంద్రుల చిత్రపటాలకు, జమ్మి చెట్టుకు ప్రత్యేక నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన ప్రజల మధ్య అతిధులు రావణ దహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి రామన్న మాట్లాడు తూ ప్రతి ఒక్కరూ చెడును వీడి సన్మార్గంలో పయనించాలని, చెడుపై మంచి సాధించిన విజయానికి సూచికగానే దసరా వేడుకలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి, ప్రధాన కార్యదర్శులు గెడం మాధవ్,సూర్యకాంత్, గౌరవాధ్యక్షుడు నర్సాగౌడ్, రవీందర్, ప్రజలు పాల్గొన్నారు.





## దేవి ఆశీస్సులు అందరికీ ఉండాలి

### ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్

**ఇంద్రవెల్లి, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
దుర్గామాత ఆశీస్సులు ఖానాపూర్ నియోజకవర్గం ప్రజలందరిపై ఉండాలని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ఆకాంక్షించారు. శుక్రవారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని స్థానిక రాధాకృష్ణ ఆలయ ప్రాంగణంలో నవయువ దుర్గా ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద నిమజ్జనం కార్యక్రమంలో పాల్గొని దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు.

### విజయదశమి అందరికీ

## విజయం చేకూర్చాలి

### సీపీ అంబర్ కిషోర్ ఝూ



**మంచిర్యాల, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
విజయదశమి అందరికి విజయాలు చేకూర్చాలని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝూ అన్నారు. విజయదశమి సందర్భంగా ఆయుధ, వాహన పూజ నిర్వహించారు. దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. విజయాలు చేకూర్చే విజయదశమి అందరికి విజయాలు చేకూర్చాలని, సుఖ సంతోషాలు కలిగించాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీభాస్కర్, పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్, గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, భీమేష్, రాజేంద్ర ప్రసాద్, ఆర్ఐ దామోదర్, శ్రీనివాస్, వామనమూర్తి, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

### తహసీల్ కార్యాలయాన్ని

## ప్రారంభించిన కలెక్టర్

**ఆదిలాబాద్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో నూతన తహసిల్దార్ కార్యాలయాన్ని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రారంభించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో ట్రైనీ కలెక్టర్ సలోనితో కలిసి మొక్కలు నాటారు.



# గాంధీ చూపిన మార్గంలో నడుద్దాం



**ఆసిఫాబాద్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
మహాత్మా గాంధీ చూపిన శాంతిమార్గంలో నడుద్దామని కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గురువారం బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతి నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గాంధీజీ అహింస మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. గాంధీ ఆశయాలను ప్రతిఒక్కరూ కొనసాగించాలన్నా రు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ జిల్లా అధికారి శివకుమార్, తహసీల్దార్ రియాజ్ అలీ పాల్గొన్నారు.

## కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

### ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి...

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ స్పెషల్ సబ్‌జైలులో గాంధీ జయంతి పురస్కరించుకుని గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ ప్రేం కుమార్‌లతో కలిసి గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన పొరపాట్లతో కుటుంబాలకు దూరంగా ఉండి శిక్ష అనుభవిస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో గాంధీ బాటలో నడవాలని సూచించారు. జైలులో ఖైదీలకు మెరుగైన సేవలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఖైదీలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐ బాలాజీ వరప్రసాద్, డిప్యూటీ జైలర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



## ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

**ముథోల్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో జరిగిన శ్రీ శారదీయ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. అమ్మవారికి మహా కుంబభిషేకం నిర్వహించి ఉత్సవాలకు పూర్ణాహుతి పలికారు. అమ్మవారి పని గ్రామంలో ఊరేగించారు ఆలయ వైదిక సిబ్బంది అధికారులు. అనంతరం జమ్మి చెట్టుని ఆలయ ఆవరణలో ప్రతిష్టించి షమీ పూజలు నిర్వహించారు. అమ్మవారి పల్లకి సేవలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గ్రామ మహిళలు ఇంటి ముందుకు వచ్చిన అమ్మవారి పల్లకికి ప్రత్యేక హారతులు నిర్వహించారు. చిన్నారులు కోలాటాలతో అమ్మ వారికి ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం ఒకరికొకరు జంబి ఆకులు ఇచ్చుపుచ్చుకొని దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

### స్థానిక సంస్థల ఎన్నికల్లో
## సమష్టి కృషితో గెలిపిద్దాం



**నిర్మల్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతు ధరలను సమిష్టి కృషితో గెలిపించుకుందామని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖా శ్యాం నాయక్ బూత్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు డైరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి తోపాటు నిర్మల్ జిల్లాకు చెందిన పలువురు నాయకులు కార్యకర్తలు భేటీ అయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో బలంగా బీసీ నినాదాలు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఏసీ చైర్మన్ రవీందర్ మాజీ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీకాంత్, కార్యకర్తలు ఉన్నారు.

### మహారాష్ట్ర సరిహద్దు
## చెక్ పోస్టుల వద్ద నిఘా

**బోథ్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ని యోజకవర్గంలోని సోనాల మండలం ఘన్ పూర్ చెక్ పోస్ట్ వద్ద, నిగిని సరిహద్దు ప్రాంతాల వద్ద పోలీసుల నిఘా ఏర్పాటు చేశామని సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో వాహనాలపై నిఘా ఏర్పాటు చేశామని ఎన్నికల కోడ్ అమలులో ఉన్నం దున 50 వేల రూపాయల వరకు వెంట తీసుకు వెళ్లేందుకు అనుమతించామన్నారు. అంతకన్నా ఎక్కువ డబ్బులు తీసుకె ళితే సరైన పత్రాలు లేకుండా నిబంధనలు ఉల్లంఘిస్తే డబ్బులు సీజ్ చేస్తామన్నారు. పెళ్లిళ్లు, ఆసుపత్రి ఖర్చుల వంటి ముఖ్యమైన అవసరాలకు పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకెళ్లేవారు ఆర్థిక లావాదేవిలకు సంబందించిన పత్రాలు దగ్గర ఉంచుకోవాలన్నారు. అంతేకాకుండా అక్రమంగా మద్యం తరలించినా, తీసుకువచ్చినా, అక్రమంగా మద్యం అమ్మినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

### దుర్గమ్మ ఆశీస్సులతో
## అభివృద్ధి సాధించాలి

### ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

**కాగజ్‌నగర్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
పారిశ్రామిక ప్రాంతమైన దసరా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. గురువారం సాయంత్రం పట్టణంలోని త్రిశూల్ పహాడ్ గుట్టపై ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు, ఉత్సవ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించారు. అనంతరం పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నారు. గుట్టపై షమీ పూజలు, రావణ దహన కార్యక్రమాలు అట్టహాసంగా నిర్వహించారు. జమ్మి పంచుతూ, ఆలింగణం చేసుకుంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పట్టణంలోని పలు కాలనీలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ నిమజ్జన శోభాయాత్రలు కన్నుల పండువగా నిర్వహించారు. డీజే చప్పుళ్ల మధ్య యువకుల నృత్యాలతో సందడి వాతావరణం నెలకొంది. వెళ్లి.. మళ్లీ రా.. దుర్గమ్మ తల్లి అంటూ, నీచల్లని ఆశీస్సులతో అభివృద్ధి సాధించాలని ప్రజలు వేడుకున్నారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



## పోలీస్ హెడ్ క్వార్టర్స్ ఆయుధ పూజ చేసిన ఎస్పీ





**ఆదిలాబాద్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
దసరా పండుగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో, ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరుపుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. దసరా పండుగ సం దర్భంగా ఆదిలాబాద్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ గురువారం నిర్వహించిన ఆయుధ పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య ఆయుధ భాండాగారంలోని ఆయుధాలకు, పోలీస్ వాహనాలకు ఎస్పీ ఆయుధ పూజలు నిర్వహించారు. విజయానికి చిహ్నంగా ఆకాశం వైపు తుపాకితో ఐదు రౌండ్‌లు కాల్చి విజయదశమిని వేడుకలను ప్రారంభించారు. జిల్లా ప్రజలందరికీ విజయదశమి సందర్భంగా విజయం చేకూరాలని ఆకర్షించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఇంద్ర వర్ధన్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు వెంకట్, మురళీ, చంద్ర శేఖర్, పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గోపాలమిత్రల సమస్యలు పరిష్కరించాలి

**బోథ్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
గోపాలమిత్రల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం నేరడిగొండ మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిసి వారు వినతిపత్రం అందించారు. తమను పశుసంవర్ధక శాఖలో ఉద్యోగులుగా గుర్తించి, రూ.24 వేల వేతనం అందివ్వాలన్నారు. శాఖలో ఉన్న ఆఫీస్ సబార్టినేట్‌గా గోపాలమిత్రలను నియమించాలని కోరారు. ప్రమాద బీమా, ఆరోగ్య బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. తమకు ఏప్రిల్ నెల నుంచి జీతాలు రాలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం దృష్టికి గోపాలమిత్రల సమస్యలను తీసుకెళ్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో గోపాలమిత్రలు రాజు, గోకుల్ జాదవ్, ఆశన్న, గంగన్న, జంగు పాల్గొన్నారు.





## దుర్గామాత శోభాయాత్ర

**ముథోల్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
బైంసాలో శుక్రవారం దుర్గామాత నిమజ్జన శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఐబీ కూడలి వద్ద ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పూజలు చేసి శోభయాత్రను ప్రారంభించారు. శోభాయాత్రలో యువకులు భక్తులు ఎంత ఉత్సాహంతో నృత్యాలు చేస్తూ ఆటపాటలతో అలరించారు. ఈ సందర్భంగా పట్టణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చే కోకుండా ఏఎస్పి అవినాష్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణ సీఐ గోపీనాథ్ భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

### మహాత్ముడి జీవితం
## అందరికి ఆదర్శం

### పోలీస్ కమిషనర్ అంబర్‌కిశోర్ ఝా

**మంచిర్యాల, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
జాతిపిత మహాత్మాగాంధీ చూపిన సత్యం, ధర్మం, సహనం, అహింస మార్గాలు ప్రతి ఒక్కరూ అనుసరించాలని, ఆయన జీవితం అందరికి ఆదర్శమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్‌కిశోర్ ఝా పేర్కొన్నారు. గురువారం గాంధీ జయంతి సందర్భంగా కమిషనరేట్‌లో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మహాత్ముడిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగినప్పుడే దేశం సర్వోన్నతి చెందుతుం దన్నారు. దేశ పౌరులు గాంధేయమార్గంలో నడుచుకోవాలని, గాంధీ చూపిన బాటలో విధులు నిర్వర్తించి ప్రజలకు పోలీస్ సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్, పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, అడిషనల్ డీసీపీ(అడ్మిన్) శ్రీనివాస్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ భీమేష్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.





## విధుల్లో చేరిన విద్యుత్ శాఖ ఏడీఈ

**బజార్‌హత్నూర్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
మండల విద్యుత్ శాఖ సంజినీర్ గుండేటి రవి కుమార్ శుక్రవారం ఇచ్చోడ విద్యుత్ శాఖ ఏడీఈ లక్ష్మణు జాయినింగ్ రిపోర్టు అందజేసి మండల విద్యుత్ శాఖ కార్యాలయంలో విధుల్లో చేరారు. ఆయన గత సంవత్సరం డిప్యూటేషన్‌పై మంచిర్యాల జిల్లాకు వెళ్లారు. ఇచ్చోడ, బజార్ హత్నూర్ విద్యుత్ శాఖ ఏఈలు రాజు, శ్రీనివాస్, కార్యాల సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు అవగాహన




**ఆసిఫాబాద్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
వృత్తివిద్య కోర్సుల్లో చదువుతున్న విద్యార్థులకు ఇంటర్న్ షిప్ భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి, డిజిటల్ ఫొటో స్టూడియోను సందర్శించారు. విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపాల్ మహేశ్వర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. సెలవులో వృత్తివిద్య కోర్సు చదువుతున్న విద్యార్థులకు ఇంటర్న్ షిప్ భాగంగా ప్రత్యక్షంగా ప్రయోగ పూర్వక జ్ఞానాన్ని పొందారని పేర్కొన్నారు. ఈ శిక్షణ జీవితంలో సొంతంగా రాణించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్ రాజు, సులోచన పాల్గొన్నారు.



## అర్హులకు ఇన్సెంటివ్ చెల్లించాలి

**ఆసిఫాబాద్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
అర్హులైన ప్రతీ కాంట్రాక్టు కార్మికుడికి ఇన్సెంటివ్ చెల్లించాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. కోల్ ట్రాన్స్‌పోర్టు లారీ డ్రైవర్లు, క్లీనర్లకు ఇన్సెంటివ్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గోలేటి సీహెచ్‌సీ దారిలో రాస్తారోకో చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమన్యం ఇటీవల ప్రకటించిన స్పెషల్ ఇన్సెంటివ్ రూ. 5500 ఇప్పటికీ చాలా మంది డ్రైవర్లు, క్లీనర్లకు అందలేదని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏరియా అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న రెబ్బెన ఎస్సై వెంకట కృష్ణ, పర్సనల్ డిపార్టుమెంట్ హెచ్‌డీ శ్రీనివాస్ ఘటనాస్థలికి చేరుకుని ఏఐటీయూసీ నాయకులతో మాట్లాడారు. అర్హులకు ఇన్సెంటివ్ అందిస్తామని సింగరేణి అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఏఐటీయూసీ నాయకుల రాస్తారోకోతో బొగ్గు సరఫరా లారీలు నిలిచిపోయాయి. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రాయిల్ల నర్సయ్య, కార్మికులు అశోక్, సతీశ్, రాజశేఖర్, రాజలింగు, శ్రీకాంత్, శ్రీనివాస్, రవీందర్, రాజన్న, వెంకటేశ్, హనుమంతు, శ్యాంరావు, విష్ణువర్ధన్, గోపాల్ పాల్గొన్నారు.

# భైంసాలో ఘనంగా దసరా వేడుకలు







**ముథోల్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
శరన్నవరాత్రి వేడుల్లో భాగంగా కొలువుదీరిన దుర్గమ్మకు 11 రోజుల పాటు భక్తులు పూజలు చేశారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అమ్మవారి నిమజ్జన వేడుకలు నిర్వహించారు. డివిజన్ కేంద్రమైన భైంసా పట్టణంలో దుర్గామాత విగ్రహాల నిమజ్జనోత్సవం ప్రశాంతంగా ముగిసింది. స్థానిక భవానీచౌక్‌లో ప్రతిష్టించిన దుర్గామండలిలో ఎమ్మెల్యే పి. రామారావు పటేల్,



అదనపు ఎస్పీ అవినాష్ కుమార్, హిందూ ఉత్సవ సమితి సభ్యులు అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం నిమజ్జన శోభాయాత్రను ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా దుర్గా మండళ్ల నిర్వాహకుల ఆధ్వర్యంలో అమ్మవారి శోభాయాత్రలు శోభాయమానంగా నిర్వహించారు. మహిళలు, యువతుల కోలాటాలు ఆడుతూ.. అమ్మవారి భక్తి గీతాలకు నృత్యాలు చేశారు. శోభాయాత్ర సందర్భంగా పోతరాజుల విన్యాసాలు అలరించాయి. భవానీచౌక్ అమ్మవారి విగ్రహం పంజేషచౌక్ వద్దకు చేరుకోగా, యువకులు భారీ సంఖ్యలో పాల్గొని నృత్యాలు చేశారు. శోభాయాత్ర పొడవునా పలుచోట్ల స్వచ్ఛందంగా పులిహోర, అన్నదానం చేశారు. శోభాయాత్ర సందర్భంగా భైంసా పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు. అదనపు ఎస్పీ అవినాష్‌కుమార్, నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా,



స్థానికంగానే ఉండి బందోబస్తు పర్యవేక్షించారు. నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల సైతం బందోబస్తును పర్యవేక్షిస్తూ, సూచనలు చేశారు. శోభాయాత్ర తీరును డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించారు. పంజేషచౌక్ వద్ద భారీగా బలగాలను మోహరించగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పంజేషచౌక్ నుంచి కిసాన్‌గల్లి మార్గాన్ని మూసివేశారు. స్థానిక గడ్డెన్నవాగు ప్రాజెక్టులో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

## బీసీలకు 42శాతం రిజర్వేషన్తోనే ఎన్నికలు జరగాలి



**మంచిర్యాల, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలాంటి అడ్డంకులు లేకుండా బీసీలకు 42శాతం రిజర్వేషన్తోనే ఎన్నికల నిర్వహణ జరగాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్‌తో కలిసి మాట్లాడారు. బీసీలకు రిజర్వేషన్‌లను తమ పార్టీ స్వాగతిస్తోందని, కాంగ్రెస్ పార్టీ దగ్గరి వ్యక్తులు కోర్టులో కేసులు వేసి ఎన్నికలను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి వేల కోట్ల నిధులు మంజూరు చేస్తోందని, స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేసి విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొయ్యల ఏమాజి, గాజుల ముఖేశ్ గౌడ్, ముత్తె సత్తయ్య, కమలాకర్రావు, వెంకటకృష్ణ, జోగుల శ్రీదేవి, అక్కల రమేశ్, వంగపల్లి వెంకటేశ్వర్రావు, ఎనగందుల కృష్ణమూర్తి, పులగం తిరుపతి, మంత్రి రామయ్య, సురేశ్, పాల్గొన్నారు.



## మాజీ మంత్రి తులాభారం

**సారంగాపూర్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
మండలంలోని అడెల్లి మహాపోచమ్మను మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ ఎదుట ఉన్న తులాభారం వద్ద అభిమానులు ఆయన బరువుకు సరిపడా బెల్లంతో తులాభారం వేయించి భక్తులకు, ప్రజలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ నారాయణరెడ్డి, పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్ రెడ్డి పాల్గొన్నారు.

## నందులపల్లిని వణికిస్తున్న నత్తలు


**నెన్నెల, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం నందులపల్లిలో నత్తలు పంటలను నాశనం చేస్తున్నాయి. గ్రామ పంచాయతీలోని ఉపాధి హామీ నర్సరీలో గతేడాది కనిపించిన నత్తలు ప్రస్తుతం ఊరంతా వ్యాపించి, పంటలనూ తినేస్తున్నాయి. ఎక్కడ చూసినా గుంపులుగా కనిపిస్తున్నాయి. కూరగాయలు, పత్తి చేలు వీటి బారిన పడడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పంటలను కాపాడుకోవడానికి అన్నదాతలు చెట్లపై నుంచి వీటిని ఏరివేస్తూ తట్టలో పట్టుకొని బయట పారేస్తున్నారు. సమస్యపై బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త నాగరాజును వివరణ అడగ్గా.. 'చాలా వరకు ఇవి అటవీ నర్సరీల్లో కనిపిస్తుంటాయి. అధిక తేమ, వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో మాత్రమే జీవిస్తాయి. ఇవి పంటలపై దాడులకు దిగితే రైతులు అప్రమత్తంగా ఉండాలి' అని పేర్కొన్నారు. నందులపల్లి గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని బట్టి సూచనలు చేస్తామన్నారు.



## ఘనంగా దుర్గామాత నిమజ్జనం



**ఆసిఫాబాద్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో శరన్నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న దుర్గాదేవి, శారద మాతల విగ్రహాలను శుక్రవారం నిమజ్జనం చేశారు. ఆసిఫాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు శోభాయాత్ర నిర్వహించి పెద్దవాగులో ఘనంగా నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఆయా మండపాల వారు దుర్గమాత, శారదదేవి విగ్రహాలను అందంగా అలంకరించి పట్టణంలో శోభా యాత్ర నిర్వహించారు. మహిళలు, యువతులు నృత్యాలు చేశారు. పట్టణంలోని ప్రధాన వీదుల గుండా భాజ భజంత్రీలతో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు మంగళ హారతులతో ఆమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్దవాగులో నిమజ్జనం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఏఎస్పీ చిత్తరంజన్ ఆధ్వర్యంలో సీఐ బాలాజీ వంప్రసాద్ సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలో శుక్రవారం దుర్గాదేవి విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు. శరన్నావరాత్రుల సందర్భంగా ఆయా కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాలకు శోభాయాత్ర కన్నుల పండువగా చేపట్టారు. అనంతరం పెద్దవాగులో నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు బెజ్జూరు మండలంలో దుర్గామాత నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో తొమ్మిది రోజుల పాటు దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్టాపించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజు దుర్గామాత విగ్రహాల నిమజ్జనాన్ని ఆనందోత్సవాల మధ్య భాజాభజంత్రీలతో శోభాయాత్ర నిర్వహించారు. దహెగాం మండలంలోని బీబ్రా, చిన్నరాస్పెల్లి, దహెగాం, గిరివెల్లి తదితర గ్రామాల్లో దుర్గాదేవి నిమజ్జన ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భాజా భజంత్రీల మధ్య వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు దాండియా, కోలాటం ఆడారు. అనంతరం భక్తులు సమీప పెద్దవాగు, ఎర్రవాగులో దేవి విగ్రహాలను నిమజ్జనం చేశారు. జైనూర్, మండల కేంద్రంలో దుర్గామాతకు గణేశ్‌నగర్, శివాజీ నగర్, విహకిర్ సెక్షన్ కాలనీ వాసులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు డప్పుల వాయిద్యాల మధ్య ఆటల పాటలతో దుర్గామాతను సమీప చెరువులో నిమజ్జనం చేశారు.



## ఇడ్లీ కొట్టు.. మరీ ఇంత తేడానా?

ఒకప్పుడు కంటెంట్, సక్సెస్ పరంగా సౌత్ ఇండియాలో నంబర్ వన్ స్థానంలో ఉండేది తమిళ ఇండస్ట్రీ. అక్కడి సినిమాలు దక్షిణాదిన అంతటా చాలా బాగా ఆడేవి. తెలుగు వాళ్లు తమిళ చిత్రాలను ఎగబడి చూసేవాళ్లు. రజినీకాంత్, కమల్ హాసన్, సూర్య లాంటి హీరోలు.. మణిరత్నం, శంకర్, మురుగదాస్ లాంటి దర్శకుల చిత్రాలను మన వాళ్లు గొప్పగా ఆదరించేవాళ్లు. కానీ గత కొన్నేళ్లలో పరిస్థితులు మారిపోయాయి. తమిళ సినిమాల క్వాలిటీ పడిపోయింది. ఒకప్పుడు కొత్తదనానికి మారుపేరుగా ఉన్న తమిళ సినిమాల్లో ఇప్పుడు ఏమాత్రం నవ్యత కనిపించడం లేదు. గతంలో డిఫరెంట్ సినిమాలను ఆదరించడంలో తమ అభిరుచిని చాటుకున్న తమిళ ప్రేక్షకులు.. ఇప్పుడు రొటీన్ సినిమాలను నెత్తిన పెట్టుకుంటున్నారు. అందుకు తాజా ఉదాహరణ..ఇడ్లీ కొట్టు. ఈ చిత్రానికి తెలుగులో బ్యాడ్ రివ్యూలు వచ్చాయి. రేటింగ్స్ 2కు అటు ఇటుగా వచ్చాయి. టాక్ కూడా ఏమాత్రం బాగా లేదు. రెండు రోజులకే సినిమా వాషౌట్ అయిపోయింది. శుక్రవారం మినిమం కలెక్షన్లు లేవీ చిత్రానికి. చివరగా తెలుగులోనే 'కుబేర' సినిమా చేసి హిట్టు కొట్టిన ధనుష్‌కు ఇది పెద్ద షాకే. ఐతే తెలుగులో ఇంత దారుణమైన పరిస్థితి ఎదుర్కొంటున్న సినిమాకు తమిళంలో మాత్రం గొప్ప ఆదరణ దక్కుతోంది. 'కుబేర' లాంటి మంచి సినిమాను తిరస్కరించిన తమిళ జనాలు.. రొటీన్ సెంటిమెంట్ మూవీ అయిన 'ఇడ్లీ కొట్టు'ను నెత్తిన పెట్టుకుంటున్నారు. ఈ సినిమాకు తమిళ క్రిటిక్స్ 3, 3.5, 4 రేటింగ్స్ ఇచ్చేయడం విశేషం. తమిళంలో టాక్ కూడా బాగుంది. నిన్న దసరా సెలవు రోజు 'ఇడ్లీ కడై' హౌస్‌ఫుల్స్‌తో రన్ అయింది. వీకెండ్ అంతా సినిమా బాగా ఆడే సంకేతాలు కనిపిస్తున్నాయి. తమిళం వరకు సినిమా సూపర్ హిట్ అవడం ఖాయంగా కనిపిస్తోంది. మామూలుగా తెలుగు, తమిళ ప్రేక్షకుల దాదాపు ఒకేలా ఉంటుంది. కానీ ఈ మధ్య అభిరుచిలో స్పష్టంగా తేడా కనిపిస్తోంది. మన వాళ్లు కొత్తదనం కోరుకుంటున్నారు. రొటీన్ సినిమాలను తిరస్కరిస్తున్నారు. కానీ తమిళ ప్రేక్షకులు రొటీన్ సినిమాలనే ఆదరిస్తున్నారు. 'ఇడ్లీ కొట్టు' ఆ కోవలోనే తమిళంలో విజయవంతం అయ్యేలా ఉంది.

## మీసాల పిల్ల అంటూ చిరంజీవి..



మెగాస్టార్ చిరంజీవి, అనిల్ రావిపూడి కాంబోలో 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమాను సంక్రాంతికి విడుదల చేయనున్నట్లు ఇది వరకే చిత్రయూనిట్ ప్రకటించింది. ఈ క్రమంలో భాగంగా చిత్ర యూనిట్ ఇప్పటి నుంచే ప్రమోషన్స్‌ను ప్రారంభించింది. అయితే దసరా పండుగ సందర్భంగా మీసాల పిల్ల సాంగ్ ప్రోమోను చిత్ర యూనిట్ రిలీజ్ చేసింది. సాంగ్ ప్రోమో అయితే అదిరిందని నెటిజన్లు సోషల్ మీడియాలో ట్వీట్స్ చేస్తున్నారు.సాంగ్ ప్రోమోనే ఇలా ఉంటే.. ఫుల్ పాట ఎలా ఉంటుందో ఊహకే వదిలేస్తున్నానని అంటున్నారు. అయితే ఈ పాటను ప్రముఖ గాయకుడు ఉదిత్ నారాయణ్ పాడారు. దీనికి భాస్కరభట్ల సాహిత్యం అందించగా భీమ్స్ స్వరాలు ఇచ్చారు. అయితే ఈ ప్రోమోలో చిరంజీవి హీరోయిన్ నయనతారను ఆటపట్టిస్తారు. అయితే ఈ ఫుల్ సాంగ్ త్వరలోనే రిలీజ్ కానుందని తెలిపారు. మరి ఫుల్ సాంగ్ ఎప్పుడు వస్తుందో చూడాలి.

## జాన్వీ జాగ్రత్త



బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ ఓ పక్క సౌత్ ఇండస్ట్రీలో స్టార్ హీరోలతో నటిస్తూనే.. మరోవైపు బాలీవుడ్ లో టైర్ 2 హీరోలతో నటిస్తోంది. సౌత్ ఇండస్ట్రీలో ఈ హీరోయిన్ నటించిన సినిమా హిట్ అయినా క్రెడిట్ మాత్రం దక్కలేదు. ఇప్పుడు బాలీవుడ్ లో వరుస సినిమాలు చేసినప్పటికీ ఒక్క సినిమా కూడా పేరు తెచ్చిపెట్టడం లేదు. దానికి కారణం అవుట్ డేటెడ్ కథలను ఎంచుకోవడమే. అన్నీ పాత చింతకాయ పచ్చడి కథలను ఎంచుకోవడం వల్లే జాన్వీకపూర్ కి బాలీవుడ్ లో వరుస ఫ్లాప్ లు ఎదురవుతున్నాయి అని సినీ విశ్లేషకులు కూడా చెబుతున్నారు.. అలా అని యాక్టింగ్ బాలేదని కాదు. తనకు ఇచ్చిన పాత్రకి 100% న్యాయం చేస్తుంది. కానీ ఎందుకో ఈమె ఎంచుకునే కథలు ప్రేక్షకులను ఆకట్టుకోవడం లేదు. ఫలితంగా సినిమాలన్నీ బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్స్ గా నిలుస్తున్నాయి. అయితే రీసెంట్ గానే ఈ హీరోయిన్ పరమ్ సుందరి అనే మూవీతో మన ముందుకు వచ్చింది.కానీ ఈ సినిమా ఎలాంటి రిజల్ట్ ఇచ్చిందో చెప్పనక్కర్లేదు.దీనికి తోడు ఇటీవల హోమ్ బౌండ్ అనే సినిమా కూడా విడుదలయ్యింది. ఈ సినిమా ఏకంగా ఆస్కార్ ప్రదర్శనకి కూడా ఎంపికైంది. కానీ ఈ సినిమా థియేటర్లలోకి వచ్చిన విషయం కూడా తెలియదు. అలా మొదటి రోజు కేవలం 30 లక్షల కలెక్షన్స్ మాత్రమే వసూలు చేసింది. దసరా సందర్భంగా విడుదలైన సన్నీ సంస్కారికీ తులసీ కుమారి సినిమా కూడా పాత చింతకాయ పచ్చడి లాగే ఉంది. ఈ సినిమా అక్టోబర్ 2న కాంతార: చాప్టర్ 1 మూవీకి పోటీగా విడుదలైనప్పటికీ.. ఆ సినిమా కలెక్షన్ల ముందు ఈ సినిమా నిలవలేకపోయింది. ముఖ్యంగా ఈ సినిమా కోసం జాన్వీ కపూర్, వరుణ్ ధావన్ లు ఇద్దరు గట్టి ప్రమోషన్స్ చేసినప్పటికీ సినిమాకి ఫలితం లేకుండా పోయింది. ముఖ్యంగా ఈ సినిమా స్టోరీ చూసుకుంటే ప్రేమించిన వాళ్లపై రివేంజ్ తీర్చుకునే నేపథ్యంలో తెరకెక్కిన స్టోరీ.. ఇందులో సన్నీ పాత్రలో వరుణ్ ధావన్, తులసి కుమారి పాత్రలో జాన్వీ కపూర్ నటించారు. ఇందులో సన్నీ పాత్రలో చేసిన వరుణ్ ధావన్ మొదట హీరోయిన్ సన్యా మల్హోత్రాని ప్రేమిస్తాడు. కానీ సన్యా మల్హోత్రా మాత్రం వాడుకొని వదిలేసి కోటీశ్వరుడిని వివాహం చేసుకోవాలని ఫిక్స్ అవుతుంది. దాంతో వరుణ్ ధావన్ ఎలాగైనా ప్రేమించిన అమ్మాయిపై రివేంజ్ తీర్చుకోవడం కోసం తన గర్ల్ ఫ్రెండ్ ని పెళ్లి చేసుకోబోతున్న వ్యక్తి మాజీ గర్ల్ ఫ్రెండ్ అయినా తులసి కుమారి అంటే జాన్వీ కపూర్ తో చేతులు కలిపి రివేంజ్ తీర్చుకోవడానికి ఇద్దరు ప్లాన్ వేస్తారు.ఆ సమయంలో కొంచెం కామెడీ తప్ప సినిమాలో అంతగా ఏమీ లేదు. కథ పూర్తిగా అవుట్ డేటెడ్.. చూసేవాళ్ళకి బోరింగ్ గా అనిపించడమే కాదు విసుగు పుట్టిస్తుంది.. ఈ సినిమాలో ఉండే ప్రతి ఒక్క సన్నివేశం ఊహించేదిగానే ఉండడంతో మైనస్ అయింది.. ఈ సినిమాకి నిర్మాతగా కరణ్ జోహార్ చేశాడనే గొప్ప తప్ప సినిమా మొత్తం డొల్ల.. ఏమీ లేదు అని ప్రేక్షకులు రివ్యూ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలోనే చాలామంది జాన్వీ కపూర్ అభిమానులు జాన్వీని హెచ్చరిస్తున్నారు. జాగ్రత్తలు తీసుకోకపోతే కెరీర్ నాశనం చేసుకోవాల్సిందే అంటూ కామెంట్లు పెడుతున్నారు. అంతేకాదు పర్ఫామెన్స్ ఇవ్వడం కాదు కథలు మంచిగా ఎంచుకో.. మంచి కథలు ఎంచుకుంటేనే పేరు వస్తుంది అంటూ కామెంట్స్ పెడుతున్నారు. మరి ఇప్పటికైనా జాన్వీ కపూర్ మంచి ప్రాజెక్టులను ఎంచుకొని ముందుకు వస్తుందా.. లేక మళ్ళీ అలాంటి రొటీన్ కథలను ఎంచుకుంటుందా అనేది చూడాలి. ఏది ఏమైనా కథల ఎంపిక విషయంలో జాన్వీ కపూర్ స్ట్రాటజీ పూర్తిగా బెడిసి కొట్టింది. ఇకనైనా జాగ్రత్త పడాలి అని, లేకపోతే ఇండస్ట్రీలో కెరియర్ కొనసాగించడం కష్టం అని కూడా చెబుతున్నారు ఫ్యాన్స్.



## చీరలో అలియా

బాలీవుడ్ నటి అలియా భట్ సంప్రదాయ వస్త్రాలంకరణలో స్టన్నింగ్ ఫొటో షూట్ షేర్ చేసింది. చీరలో అలియా అందాలకు ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. ఈ ఫోటోలపై మీరు కూడా ఓ లక్కేయండి. బాలీవుడ్ బ్యూటీ అలియా భట్ దసర నవరాత్రుల వేడుకలో సందడి చేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను అలియా తన ఇన్ స్టాగ్రామ్ వేదికగా పంచుకున్నారు. ఈ వేడుకల్లో అలియా పసుపు రంగు చీర దానిపై ఫుల్ స్లీవ్స్ విత్ డీప్ నెక్ డిజైనర్ బ్లౌజ్ ధరించి అందంగా ముస్తాబయింది.చీరలో అలియా స్టన్నింగ్ లుక్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ పిక్స్ చూసిన వారంతా అలియా అందాలకు ఫిదా అవుతున్నారు. సోషల్ మీడియాలో ఎల్లప్పుడూ ఫుల్ యాక్టివ్ గా కనిపించే.. తరచూ లేటెస్ట్ ఫ్యాషన్ లుక్స్ తో నెటిజన్లను ఆకట్టుకుంటుంది. ఓ వైపు సినిమాలు చేస్తూనే మరోవైపు బ్రాండ్ ప్రమోషన్స్, కమర్షియల్ యాడ్స్ తో ఫుల్ బిజీగా ఉంటుంది ఈ బ్యూటీ. బాలీవుడ్ తో పాటు తెలుగులోనూ సత్తాచాటింది అలియా. రాజమౌళి RRR సినిమాలో సీత పాత్రలో తెలుగు ఆడియన్స్ ను ఫిదా చేసింది.ప్రస్తుతం అలియా బాలీవుడ్ సినిమాలతో బిజీగా ఉంది.






# వైభవంగా దసరా వేడుకలు.. భక్తి శ్రద్ధలతో శమీ పూజ

**చెడుపై మంచి సాధించిన విజయమే దసరా - ఎన్నికల కోడ్ కారణంగా ముందుగానే పాల్గొన్న ఎమ్మెల్యే**
**రావణ దహనం చేసిన జిల్లా కలెక్టర్, ఎస్పీ - వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యేలు**

**ఆదిలాబాద్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా నిర్వహించుకునే దసరా(విజయదశమి) వేడుకలు గురువారం ఆదిలాబాద్ జిల్లాల్లో ఊరూరా ఘనంగా జరిగాయి. తొమ్మిది రోజుల పాటు దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేసి భక్తులు.. దశమి రోజున దసరా పండుగను కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలు, దుర్గా మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేసి, రామ్‌లీలా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని దస్నాపూర్ మైదానంలో హిందూ సమాజ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో రామ్‌లీలా కార్యక్రమంలో భాగంగా రా






వణాసురుడి బొమ్మను దహనం చేశారు. కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ కార్యక్రమ ముఖ్య అతిథులుగా వేడుకల్లో పాల్గొన్నారు. అటు స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ కారణంగా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ అధికారులతో కాకుండా ముందుగానే వేడుకల్లో పాల్గొన్నారు. అనాదిగా వస్తున్న కార్యక్రమం ఆచారంలో భాగంగా ముందుగా శ్రీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో కలెక్టర్, ఎస్పీలు ప్రత్యేక పూజలు చేసి, అక్కడి నుండి దసరా మైదానం వరకు కాషాయపు జెండాలను చేత పట్టుకుని పాదయాత్రగా వెళ్లారు. అనంతరం జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా మైదానంలో ఏర్పాటు చేసిన భారీ రావణ ప్రతిమాకు ఎస్సీ నిప్పంటించి దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ విజయదశమి అంటే చెడుపై మంచిని సాధించడమే అన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ... విజయదశమి రోజే రావణ దహనంతో పాటు మనలోని కోపం, అహంకారం, అసూయను వదిలేయాలని సూచించారు. కార్యక్రమంలో హిందూ సమాజ్ ఉత్సవ సమితి అధ్యక్షులు బొంపల్లి హన్మాడ్లు, ప్రధాన కార్యదర్శి రాళ్లబండి మహేందర్, అధికారులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



# పల్లెపల్లెనా దసరా సంబురం.. శమీ పూజల్లో పాల్గొన్న ప్రముఖులు



**జమ్మి చెట్ల వద్ద ప్రజల సందడి**
**ఆయుధ, వాహన పూజలు**
**ఘనంగా దుర్గా మాత విగ్రహాల శోభాయాత్ర..**

**మంచిర్యాల, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నస్పూర్ న్యూ నాగార్జున కాలనీలో శుక్రవారం దుర్గాదేవి శోభయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారు శరన్నవరాత్రోత్సవాలలో ఒక్కో రోజు ఒక్కో అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. నూతి వెంకటాచార్యుల ఆధ్వర్యంలో శ్రీ విజయ కనక దుర్గా భక్త మండలి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు ఆఖరి రోజు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలతో పాటు అమ్మవారి ముందు పూజలు అందుకున్న శ్రీచక్రానికి వేలం పాట నిర్వహించగా భక్తులు పోటీపడ్డారు.

**కోలాటాలు, నృత్యాలు నడుమ శోభయాత్ర...**
డబ్బు చప్పుళ్లు, డీజే సౌండ్లకు మహిళల కోలాటాలు, యువకుల నృత్యాల మధ్య అమ్మవారి శోభయాత్ర అంగరంగ వైభవంగా సాగింది. భవానీ మాల వేసిన భక్తులు, మహిళల నడుమ ఆధ్యాంతం భక్తిపారవశ్యంలో అమ్మవారి యాత్ర కొనసాగింది. భక్తులు అమ్మవారి రథానికి నీళ్లు చల్లి కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. సింగరేణి కార్మికులు, కార్మిక కుటుంబాలు మంగళహారతులతో అమ్మవారికి స్వాగతం పలుకుతూ శోభ యాత్ర వెంట నడిచారు. సమీప గోదావరి నదీ తీరంలో నిమజ్జనం చేశారు.





## వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు

**చెన్నూర్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
విద్యుత్ తీగలు అమర్చి అటవీ జంతువులను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని అటవీ డివిజన్ అధికారి సర్వేశ్వర్ హెచ్చరించారు. మండలంలోని ఒత్కులపల్లి, కొత్తపల్లి గ్రామాల సమీపాల్లోని అటవీ ప్రాంతంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు వన్యప్రాణుల కోసం విద్యుత్ తీగలు అమర్చారని అందిన పక్కా సమాచారం మేరకు అటవీ సిబ్బందితో కలిసి వెళ్లి విద్యుత్ తీగలను తొలగించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ తీగలు ఎవరు అమర్చారో విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామన్నారు. అటవీ జంతువులను వేటాడినా, వాటి అవాసాలకు ముప్పు తలపెట్టినా, ఉరులు, ఉచ్చులు పెట్టినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వన్యప్రాణుల వేట కోసం అటవీ సరిహ ద్దుల వెంట విద్యుత్ ఉచ్చులు అమర్చటం ప్రమాదకరమని నీల్వాయి అటవీ రేంజ్ అధికారి హఫీజొద్దీన్ అన్నారు. బుధవారం అటవీ రేంజ్ పరిధిలోకి వచ్చే కల్మలపేట, చామనపల్లి, బద్దంపల్లి ఇతర గ్రామాల్లో వన్యప్రాణుల వేట వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో డీఆర్వో ప్రమోద్ కుమార్, ఎఫ్‌బీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

## మూడు రోజులు వానలు

**ఆదిలాబాద్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
ఉమ్మడి జిల్లాలో మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ మేరకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులతో వర్షాలు కురుస్తాయని తెలిపింది. తేలికపాటి నుంచి ఒక మోస్తరు వానలు పలు పడతాయని పేర్కొంది. శనివారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉందని సూచించింది. ఆది, సోమవారాల్లో సైతం పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది.

## కార్మికులు, యాజమాన్యానికి వారధిగా యూనియన్

**ఓరియంట్ సిమెంట్ కంపనీ గుర్తింపు సంఘం అధ్యక్షుడు సత్యపాల్ రావు**

**కాసిపేట, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
కార్మికులు, ప్రజలు, యాజమాన్యానికి వారధిగా యూనియన్ పని చేస్తుందని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపనీ గుర్తింపు సంఘం అధ్యక్షుడు సత్యపాల్ రావు తెలిపారు. కంపెనీ తరపున సమీప గ్రామాల ప్రజలకు సేవలందిం చేందుకు అంబులెన్స్‌ను గురువారం ప్రారంభించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా దసరా బోనస్ రూ.4వేలు పెంచినట్లు తెలిపారు. ఒకేసారి 26 క్వార్టర్లు అర్హులకు ఇప్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ సతీష్ రెడ్డి, మెరుగు శంకర్, నాయకులు జనార్ధన్, అబ్దుల్ సత్తర్, కొమ్ముల బాపు తదితరులు పాల్గొన్నారు.



# కిక్కెక్కించిన దసరా మద్యం



- ముందుగానే సరుకు కొనుగోలు
- బహిరంగంగా కనిపించని మాంసం విక్రయాలు
- లోలోపల మాత్రం ఆగని వధ
- గాంధీ జయంతి ప్రభావం పడకుండా దసరా..
- మంచిర్యాలలో రూ.60కోట్లపైనే వ్యాపారం
- 3రోజుల్లో రూ.26.38కోట్ల లిక్కర్ విక్రయాలు
- అదే జోరులో సాగిన మాంసం విక్రయాలు

**ఆదిలాబాద్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**

*తెలంగాణలో విసయదశమి పెద్ద పండుగ... పల్లెటూరు నుంచి పట్టణాల వరకు దసరా పండుగ రోజు మద్యం, మాంసం లేనిదే పూటగడవదు అన్నట్లుగా తెలంగాణ ప్రజలు వేడుకలు ఘనంగా జరుపుతుంటారు. అయితే ఈసారి విజయదశమితోపాటు మహాత్మా గాంధీ జయంతి ఒకే రోజు (అక్టోబరు 2వతేదీ) రావటంతో మందుబాబులకు కొంత నిరశే ఎదురయింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అక్టోబరు 2న మాంసం, మద్యం విక్రయాలు జరుపరాదంటూ మున్సిపల్ శాఖ, గ్రామపంచాయతి శాఖల ప్రభుత్వ అధికారులు ప్రకటనలు విడుదల చేశారు. కొన్ని ప్రాంతాల్లో దప్పుచాటింపు కూడా నిర్వహించారు. అయినప్పటికీ కొన్ని ప్రాంతాలలో యథేచ్ఛగా మాంసం, మద్యం అమ్మకాలు కొనసాగినట్లు తెలుస్తోంది. పేరుకు వైన్‌షాపులు, చికెన్ మటన్ షాపులు బంద్ అని మూసివేసినప్పటికీ రహస్యంగా మాంసం, మద్యం విక్రయాలు జరిగాయి. మద్యం ప్రియులు దసరా వేడుకల కోసం ముందస్తుగా సెప్టెంబరు 29, 30, అక్టోబరు 1న మద్యం కొనుగోలు చేశారు.*

దసరా వేడుకలను ప్రజలు ధూం ధాంగా జరుపుకున్నారు. ఎక్కడా జోరు తగ్గించలేదు. గాంధీ జయంతి ప్రభావంతో మార్కెట్‌లో బహిరంగంగా ఉల్లంఘనలు జరగకపోయినప్పటికీ లోలోపల మాత్రం యథేచ్ఛగా కొనసాగాయి. మద్యం దుకాణాలు మూసివేసి ఉంచగా, బహిరంగంగా మాంసం విక్రయాలు చేపట్టలేదు. లిక్కర్‌ను ముందే కొనుగోలు చేసిన మద్యం ప్రియులు పండుగ జోష్ రాజీపడలేదు. లోలోపల మటన్, చికెన్ విక్రయాలు జోరుగా సాగాయి.

**మార్కెట్‌పై ప్రభావం...**

అక్టోబర్ 2న గాంధీ జయంతి, దసరా పండగ కలిసి రావడంతో ఆ ప్రభావం బహిరంగ మార్కెట్‌పై పడింది. ప్రధానంగా దసరా పండగ అంటేనే మద్యం, మాంసం విక్రయాలతో సంబంధం ఉన్న వేడుక. అయితే ప్రభుత్వ ఆదేశాల మేరకు మద్యం దుకాణాలన్నీ మూసివేశారు. అలాగే స్లాటర్ హౌస్‌లలో ఎక్కడ కూడా పశువధ జరగలేదు. అయితే జిల్లాలో వారం రోజులుగా లిక్కర్, బీర్ల అమ్మకాలు మాత్రం జోరుగా సాగాయి. మద్యం ప్రియులు పండుగకు ముందుగానే స్టాక్ తీసుకొని ఇంట్లో నిల్వ చేసుకున్నారు. అలాగే మాంసం విక్రయదారులు తమ ఇళ్లలో, లేనిపక్షంలో ఏదైనా అనువైన స్థలంలో మేకలు, కోళ్లను వధించారు.

**కిక్కెక్కించిన మద్యం..**

జిల్లాలో గడిచిన ఆరు రోజుల్లో రూ.6.84 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. గతేడాదితో పోల్చితే సుమారు 10 శాతం పెరిగినట్లు ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. మొత్తంగా 12,564 కేసుల లిక్కర్, బీర్ల విక్రయాలు జరిగాయి. అందులో 9,932 కేసుల లిక్కర్, 2,632 కేసుల బీర్లు ఉన్నాయి. జిల్లాలో దసరా రోజు సుమారు 15 టన్నుల మాంసం విక్రయాలు జరిగాయి. 5టన్నుల వరకు మటన్, 10 టన్నుల వరకు చికెన్ విక్రయాలు ఉన్నట్లుగా అంచనా వేస్తున్నారు.

**దుమ్మురేపిన నల్లనేల...**

**మంచిర్యాల :** దసరా పండుగ ఈ సంవత్సరం ప్రజలకు మాంచి కిక్ ఇచ్చింది. గత సంవత్సరంతో పోల్చితే ఈ సారి మద్యం, ఇతర వ్యాపారాల్లో విక్రయాలు పెరడమే దీనికి నిదర్శనం. దసరాను పురస్కరించుకొని తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ ద్వారా మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్, లక్షెట్టిపేట ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో ఈ నెల 28,29,30 తేదీల్లో రూ. ఏకంగా 11.26 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. 3 సర్కిళ్ల పరిధిలో మొత్తం 10,570 కేసుల లిక్కర్ విక్రయాలు నమోదు కాగా 14,296 కేసుల బీర్ల విక్రయాలు జరిగాయి.

**పెరిగిన మద్యం అమ్మకాలు....**

దసరా పండుగను పురస్కరించుకొని ఏ వ్యాపారం ఎలా ఉన్నా మద్యం అమ్మకాలు మాత్రం విపరీతంగా జరుగుతుండం విశేషం. గత ఏడాదితో పోలిస్తే ఈసారి అమ్మకాలు గణనీయంగా పెరడంతో వ్యాపారస్థులు ఆ నందోత్సాహాల్లో తేలియాడుతున్నారు. 2024లో దసరా సమయంలో మూడు రోజుల పాటు సాగిన మద్యం అమ్మకాల వల్ల అబ్కారీ శాఖకు రూ. 11.19 కోట్లు ఆదాయం సమకూరగా ఈ సంవత్సరం గత సంవత్సరం కంటే రూ. 7 లక్షల విలువైన అమ్మకాలు అధికంగా నమోదయ్యాయి. ఈ సంవత్సరం దసరా గాంధీ జయంతి రోజు రావడంతో ఆ రోజు మద్యం దుకాణా లు మూసి వేస్తారనే ఆలోచనతో ఉన్న మద్యం ప్రియులు మూడు రోజుల ముందు నుంచే సరుకు కొనుగోలు చేసి అందుబాటులో ఉంచుకున్నారు.



**యువతలో దసరా కిక్...**

ఈ యేడు యువత దసరాను మస్తుగా ఎంజాయ్ చేశారు. దసరాకు మూడు రోజుల ముందు నుంచి సాగిన మద్యం అమ్మకాలను పరిశీలిస్తే బీర్ల అమ్మకాలు ఊపందుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఏకంగా 14,296 కేసుల బీర్ల విక్రయాలు జరిగాయి. లిక్కర్‌తో పోల్చితే బీర్ల విక్రయాలు అధికంగా రూ. 3 కోట్ల 72 లక్షలు న మోదయ్యాయి. రెడీమేడ్‌దుస్తుల షాపుల్లోనూ కొనుగోళ్లు అధికంగా ఉన్నాయని తెలిపారు.

**వస్త్ర దుకాణాల్లోనూ..**

దసరా పండుగను పురస్కరించుకొని వస్త్ర దుకాణా లు ఈ సంవత్సరం కళకళలాడాయి. జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సరం రూ. 50 కోట్ల మేర వ్యాపారం జరిగి నట్లు అంచనా. గత సంవత్సరంతో పోలిస్తే వస్త్ర దుకాణాల్లో విక్రయాలు గణనీయంగా వృద్ధి సాధించినట్లు వ్యాపారులు తెలిపారు. దసరా పండుగ నేపథ్యంలో పేరు గాంచిన షాపింగ్ మాల్‌లు, షోరూముల్లో ప్రజల ఆసక్తికి అనుగుణంగా పెద్ద మొత్తంలో స్టాకు ఉంచగా, ఊహించిన దానికంటే రెట్టింపు అమ్మకాలు నమోదైనట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.2కోట్ల విలువగల మేకలు, చికెన్, మటన్ విక్రయాలు జరిగినట్లు తెలుస్తోంది.

**లాభాల బోనస్ జమ చేయడంతో....**

సింగరేణి కార్మికులకు యాజమాన్యం లాభాల బో నస్ అందజేయడంతో ఈ సంవత్సరం కొనుగోళ్లు ఊ పందుకున్నాయి. లాభాల బోనస్ 34 శాతం చెల్లించడంతో ప్రతి కార్మికుడికి సగటున రూ. లక్షా 95 వేల పై చిలుకు చేతికి అందడంతో దసరా కొనుగోళ్లపై దృష్టిసారించినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది దసరా పండుగను ఘనంగా జరుపుకున్నారు.

# మహనీయుల అడుగుజాడల్లో నడవాలి





**ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా**
**మహాత్మునికి నివాళులర్పించిన ఎమ్మెల్యే, మాజీ మంత్రి**

**ఆదిలాబాద్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**

మహనీయుల అడుగుజాడల్లో నడిచి, దేశాభివృద్ధికి పాటుపడాలని ఆదిలాబాద్ జిల్లా రాజర్షి షా అన్నారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు, కలెక్టర్ రాజర్షి షా,ఎస్పీ అఖిల్ మహాజన్ లు జిల్లా జైలును సందర్శించి, ఖైదీలతో కలిసి మహాత్మా గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. అటు మహాత్మా గాంధీజీ కలలకు అనుగుణంగా ప్రధాని మోడీ సుపరి పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిల సందర్భంగా వారి చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రపంచానికి మార్గదర్శకులుగా గాంధీజీ, లాల్‌బహుదూర్ శాస్త్రిజీ నిలిచారని ఆయన కొనియాడారు. అటు అహింసామార్గం ద్వారానే దేశానికి స్వాతంత్రం తెచ్చి పెట్టిన గొప్ప నాయకుడు మహాత్మా గాంధీ అని మాజీ మంత్రి జోగురామన్న అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా ఆదిలాబాద్ లోని ఆ మహాత్ముని విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



## స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలి

**గుడిహత్నూర్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**

స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎంపీ నగేశ్ పేర్కొన్నారు. గుడిహత్నూర్ మండల కేంద్రానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు ఎంపీ నగేశ్‌ను శుక్రవారం పట్టణంలో మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నాయకులు కేశవ్, వామన్, సుధాకర్, తదితరులున్నారు.



దసరా అందరికి విజయాలు చేకూర్చాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. విజయదశమి సందర్భంగా ఆయన వాహన పూజలు చేశారు. విజయదశమి సుఖసంతోషాలు కలిగించాలంటూ జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

## నాగోబా ఆలయంలో పూజలు

**ఇంద్రవెల్లి, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**

దసరా పండుగ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయంలో మెస్రం వంశీయులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి భక్తులు భారీగా తరలివచ్చి నాగోబాను దర్శించుకున్నారు. మెస్రం వంశీయులు జమ్మి ఆకులతో పూజలు చేశారు. నాగోబాకు జమ్మిని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పీఠాధిపతి వెంక ట్రావ్, వంశీయులు కోసేరావ్, కొసు కటోడ, నాగ్నాథ్, దేవ్వ్, శేఖరా బాబు తదితరులున్నారు.

## మహాత్మా.. మన్నించు!

**గాంధీజయంతి రోజు 'బెల్ట్' జోరు**
**'మామూలు'గా తీసుకున్న అధికారులు**

**మంచిర్యాల, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**

దసరా పండుగ, గాంధీ జయంతి రెండూ ఒక్కరోజే రావడంతో ఏమి చేయాలో తెలియక ఒక్కసారికి మహాత్మా.. మన్నించు.. అంటూ బెల్టాపుల నిర్వాహకులు యథేచ్ఛగా మద్యం విక్రయాలకు తెరలేపారు. ప్రభుత్వం గాంధీ జయంతిరోజు మందు, మాంసాన్ని నిషేధించింది. అయితే, మాకేంటని ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కేసి మద్యం దుకాణాల వ్యాపారులే బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయాలు జరిపినట్లు తెలిసింది. మంచిర్యాల జిల్లాలో గల్లీకో బెల్టుషాపు తెరిచి మద్యం విక్రయాలు జరిపించారు. గాంధీ జయంతి సందర్భంగా మద్యం ఎవరు విక్రయించినా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు 'మామూలు'గా తీసుకోవడంపై సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. చాలా మంది ఓపెన్‌గానే మద్యం, మాంసం విక్రయాలు జరిపారు. మద్యంతో పాటు మాంసం విక్రయాలు యథేచ్ఛగా జరిగాయి.. జిల్లా కేంద్రంలోని హమాలీవాడ వైపు రైల్వేస్టేషన్ పక్కనే ఓ బెల్ట్ షాపు నిర్వాహకుడు మద్యం విక్రయిస్తుండగా ఈ రోజు గాంధీ జయంతి కదా మద్యం ఎలా అమ్ముతున్నావు అని ప్రశ్నించిన ఓ విలేకరికి 'పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికా రులకు మామూళ్లు ఇస్తున్నాం.. మమ్మల్ని ఎవరు ఏమీ చేయ లేరు' అని దురుసుగా ప్రవర్తించడం గమనార్హం.

# అభ్యర్థుల ఎంపికపై కసరత్తు..!



- స్థానిక ఎన్నికలకు సిద్ధమవుతున్న పార్టీలు
- ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న పార్టీలు
- బలమైన అభ్యర్థులను దింపేందుకు కసరత్తు
- సర్వే ప్రాతిపదికనే అభ్యర్థుల ఎంపిక
- ముగ్గురు పేర్లతో జాబితా రూపొందించి అధిష్ఠానానికి పంపేయత్నంలో కాంగ్రెస్
- స్థానికంగానే బీఆర్ఎస్ అభ్యర్థుల ఖరారు
- అన్ని స్థానాల్లో పోటీకి బీజేపీ సిద్ధం
- చేరికలపై దృష్టి సారించిన రాజకీయ పక్షాలు

**(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)**

జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామపంచాయతీ ఎన్నిల్లో పోటీకి దింపేందుకు రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపికపై కసరత్తులు జరుపుతున్నాయి. అంగబలం, అర్థబలం కలిగి ఉండడంతో పాటు ప్రజల్లో పేరు ప్రతిష్టలు కలిగిన నాయకులను రంగంలోకి దింపేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు సిద్ధమవుతున్నాయి. అధిష్ఠానం సూచన మేరకు కాంగ్రెస్ పార్టీ ముగ్గురు పేర్లను పంపనుంది. స్థానిక నాయకత్వం అభీష్టం మేరకు అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో బీఆర్ఎస్ ఉంది. బీజేపీ అన్ని స్థానాల్లో పోటీకి సిద్ధమవుతోంది.

**ఎంపీటీసీలుగా పోటీకి అనాసక్తి..**

సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఒకేసారి రావడంతో ఆశావహులు ఎక్కువగా సర్పంచ్ పదవులకు మొగ్గు చూపుతున్నారు. సీట్లు దక్కించుకోవడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఎంపీటీసీలుగా పోటీ చేయడానికి అంతగా ఆసక్తి కనబరచడం లేదు. గ్రామంలో సర్పంచ్ స్థానానికి పోటీ చేయడంపైనే దృష్టి సారించి పావులు కదుపుతున్నారు.

**కాంగ్రెస్‌లో ఆశావహులు ఫుల్..**

కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో ఆశావహులు అధికంగా ఉన్నారు. దీంతో పార్టీ నాయకత్వం ఆచితూచి అడుగులు వేస్తోంది. క్షేత్రస్థాయిలో ప్రజాధరణతో పాటు ఆర్థికంగా ఉన్న నాయకుల కోసం అన్వేషిస్తోంది. ముగ్గురు పేర్లను పరిశీలించి, వారిలో గెలిచే వ్యక్తి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయనుంది. ప్రధానంగా జడ్పీటీసీ సంబంధించి ప్రతీ మండలానికి ముగ్గురు చొప్పున ఆశావహుల పేర్లను తమకు పంపించాలని అధిష్ఠానం ఎమ్మెల్యేలు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిలను ఆదేశించింది. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవి జనరల్ మహిళలకు రిజర్వ్ కావడంతో సంబంధిత స్థానాల్లో పోటీ తీవ్రంగా ఉండనుంది. నియోజకవర్గ నేతల బంధువులు, మాజీ ప్రజాప్రతినిధుల బంధువులు, గత ఎన్నికల్లో ప్రయత్నాలు చేసి విఫలమైన నేతలు పోటీ పడుతున్నారు. రిజర్వేషన్లు కలిసి వచ్చిన వారు పోటీపై తమ ఆసక్తిని బయటపెడుతున్నారు. దీంతో ఖర్చు భరించే స్థోమత ఉందా..? లేదా అని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు జాబితా సిద్ధం చేసే పనిలో కాంగ్రెస్ నేతలు నిమగ్నమయ్యారు.

**అన్నిస్థానాల్లో పోటీకి బీజేపీ సిద్ధం..**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలతో పాటు సర్పంచ్ పదవులకు పోటీలో అభ్యర్థులను నిలపడానికి బీజేపీ సిద్ధమవుతోంది. కొత్త నాయకత్వంతో పాటు గతంలో పార్టీ కోసం పనిచేసి అవకాశాలు రానివారికి ప్రాధాన్యం ఇచ్చేందుకు ప్రణాళికలు వేస్తున్నారు. బీజేపీలో నియోజకవర్గ ఇన్‌చార్జిలు జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో రిజర్వేషన్లకు అనుగుణంగా ఉన్న వారికోసం వేట మొదలైంది. ఆదరణ, అధికార పార్టీ అభ్యర్థులను ఎదుర్కొనే శక్తి ఉన్న నాయకులకు అవకాశం ఇచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. పార్టీ బలహీనంగా ఉండి పోటీలో నిలిచేందుకు అభ్యర్థులు లేని చోట్ల ఇతర పార్టీల నుంచి వచ్చే నేతలకు అవకాశం ఇవ్వడానికి యోచిస్తున్నారు. స్థానిక నాయకత్వం అభీష్టం మేరకు అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో బీఆర్ఎస్ ఉంది.

**సర్వేల ఆధారంగా..**

అభ్యర్థుల విషయంలో ప్రధాన రాజకీయ పార్టీలు సర్వే చేయిస్తున్నాయి. సర్వేల నివేదిక ఆధారంగా అభ్యర్థులను రంగంలోకి దించనున్నాయి. మరోవైపు కేడర్ అభిప్రాయాలను కూడా సేకరించేందుకు పార్టీలు సిద్ధమవుతున్నాయి. ముఖ్యంగా జడ్పీటీసీ అభ్యర్థుల విషయంలో ఏజెన్సీలతో సర్వే చేయిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి.

**ముఖ్యనేతలు, అసంతృప్తులకు గాలం..**

మెజార్టీ స్థానాలను కైవసం చేసుకునేందుకు రాజకీయ పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఇతర పార్టీల్లోని ముఖ్య నాయకులు, అసంతృప్తులకు గాలం వేస్తున్నాయి. తమకు టికెట్ దక్కదనే అభిప్రాయానికి వచ్చిన పలువురు ఆశావహులు ఇతర పార్టీల వైపు చూస్తున్నారు. ఇదే సమయంలో ఆయా రాజకీయ పార్టీలు సైతం తమ బలాన్ని పెంచుకునేందుకు ఫిరాయింపు రాజకీయాలపై దృష్టి సారించాయి. కాగా అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్నికలు జరుగుతాయనే నమ్మకంతో ముందుకు వెళ్తుండగా... ప్రతిపక్షాలు మాత్రం రిజర్వేషన్లపై ఈనెల 8వ తేదీన కోర్టు ఇచ్చే ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నాయి. రాజకీయ పక్షాల నేతలు అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. దీంతో పల్లెల్లో రోజురోజుకు రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది.

## అతివలకు అండగా షీటీం

### ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**

షీటీం 24 గంటలు సేవలందిస్తోందని ఎస్పీ అఖిల్ మహాజన్ ఓ ప్రకటనలో తెలిపారు. మహిళలు, చిన్నారుల భద్రత, రక్షణకు పని చేస్తోందని పేర్కొన్నారు. దుర్గా నవరాత్రి ఉత్సవాల్లో రాత్రి వేళ మహిళలను వేధించిన ఆకతాయిలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని 16 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. దసరా సందర్భంగా రాత్రి వేళ దస్నాపూర్ ప్రాంతంలో మహిళలను వేధించిన జిల్లా కేంద్రానికి చెందిన షిండే రాహుల్, యోగేశ్, పద్మశాలీ విఠల్, షిండే నితిన్, అడలోలు నరేశ్, రోహిత్, బొంపల్లి ప్రసాద్, షేక్ పర్వేజ్, ధూత్రి పరమేశ్వర్, మావల పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు చేసినట్లు వివరించారు. ఇటీవల ఆది లాబాద్ నుంచి మహారాష్ట్రలోని కేళాపూర్ వెళ్లే పాదయాత్ర సమయంలో మహిళను వేధించిన మడావి దత్తుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



జిల్లా వ్యాప్తంగా యువత, విద్యార్థులు, పని స్థలాల్లో మహిళలకు 20 అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సెప్టెంబర్లో 24 ఈ పెట్టీ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నెల వ్యవధిలో జిల్లా వ్యాప్తంగా 119 హాట్ స్పాట్‌లలో తనిఖీ చేసినట్లు తెలిపారు. ఆరు కౌన్సిలింగ్ ద్వారా కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. ఆపద ఎదురైతే ఆదిలాబాద్ షీటీం బృందాలకు 8712659953 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈనెలలో మహిళల నుంచి దాదాపు 31 ఫోన్ కాల్స్ ద్వారా ఫిర్యాదులు రాగా పరిష్కరిం చినట్లు ఆయన పేర్కొన్నారు.






## నిమజ్జనంలో సౌదీ షేక్ సందడి

**సారంగాపూర్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**

దుర్గాదేవి నిమజ్జనోత్సవంలో సౌదీ అరేబియా దేశానికి చెందిన యువ వ్యాపారవేత్త సందడి చేశాడు. జిల్లా నుంచి సౌదీ అరేబియా దేశంలో ఉపాధి పొందుతున్న ఎన్ఆర్ఐల ఆహ్వానం మేరకు సౌదీ షేక్ అబ్దుల్లా మోహసిన్ సారంగపూర్ మండలం చించోలి(బి) గ్రామ పరిధిలో ఓ కార్యక్రమానికి హాజరయ్యాడు. నిమజ్జన ఉత్సవాల్లో పాల్గొన్న షేక్‌తో కలిసి ఫొటోలు దిగేందుకు స్థానికులు ఆసక్తి చూపారు.

## నార్నూర్‌లో కూలిన ఇల్లు

**నార్నూర్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో మండలంలోని నాగల్ కొండ గోందు గూడ గ్రామానికి చెందిన కే. లక్ష్మణ్ ఇల్లు కుప్పకూలడంతో ప్రమాదం తప్పింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఈదురు గాలులతో ఇల్లు పై కప్పు ఒక్కసారిగా రేకులతో సహా కూలి పడిందని తెలిపారు. అప్రమత్తమై బయటికి రావడంతో ప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు. నిత్యావసర సరుకులు తడిసిపోయాయని ఆయన తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నారు.



# మద్యం మత్తులో కారు నడిపి..
# గ్రామస్తులను ఢీ కొట్టిన మున్సిపల్ డీఈ



### నలుగురికి గాయాలు
### కారును ధ్వంసం చేసి, చితకబాదిన గ్రామస్తులు
### బెల్లంపల్లి మండలం బుచ్చయ్యపల్లిలో ఘటన

**బెల్లంపల్లి, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం బుచ్చయ్యపల్లి గ్రామంలో గురువారం రాత్రి ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలో డిఈఈ (డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్)గా పనిచేస్తు న్న అరుణ్ కుమార్ మద్యం మత్తులో బీభత్సం సృష్టించారు. దసరా వేడుకల్లో భాగంగా జమ్మి చెట్టు వద్ద కు పూజలు నిర్వహించి గ్రామస్తులు శుభాకాంక్షలు తెలుపుకుంటున్న సమయంలో ఒక్కసారిగా అతిగా మద్యం సేవించిన అరుణ్ కుమార్ తనకారుతో అక్కడ వేడుకల్లో పాలుపంచు కుంటున్న గ్రామస్తులను అతివేగంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో బుచ్చయ్య పల్లి గ్రామానికి చెందిన రణవేని రఘు అనే యువకుని కాలికి గాయం కాగా, పందుల రాజు అనే యువకుని చేయి విరిగింది. వీరితోపాటు మరో మధు, పవన్ అనే మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిని వెంటనే బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించారు. స్థానికుల కథనం మేరకు ఆకెనపల్లి గ్రామానికి చెందిన పోలంపల్లి అరుణ్ కుమార్ ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలో డిప్యూటీ ఇంజనీర్‌గా పనిచేస్తున్నా రు. దసరా పండుగ కోసం గ్రామానికి వచ్చారు. గురువారం సాయంత్రం తన స్నేహితులతో కలసి పెద్ద దుబ్బ గ్రామ పరిసరాల్లోని పొలం వద్ద మద్యం సేవించారు. మద్యం మత్తులో అతివేగంగా కారు నడుపుతూ బుచ్చయ్యపల్లి గ్రామం వద్ద దసరా వేడుకల్లో భాగంగా జమ్మి చెట్టు వద్ద పూజలు చేసేందుకు వస్తున్న గ్రామస్తులను ఢీ కొట్టి ఆకెనపల్లి వైపుకు వేగంగా కారును నడుపుకుంటూ వెళ్లారు. ప్రమాదం నుంచి చేరుకు న్న మరి కొంతమంది గ్రామస్తులు కారు వెంట ద్విచక్ర వాహనాలతో వెంబడించి ఆకెనపల్లి గ్రామంలో కారు ను అడ్డుకొని డీఈఈ అరుణ్ కుమార్ ను చితకబాదారు. బుచ్చయ్యపల్లి గ్రామస్తులు ఆగ్రహంతో కారు అద్దాలను పూర్తిగా ధ్వంసం చేశారు. తాళ్ల గురిజాల పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.



## సోలార్ విద్యుత్ తీగ తగిలి రైతు

**నేరడిగొండ, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
పంట రక్షణకు అమర్చిన సోలార్ ఫెన్సింగ్ తీగకు తగిలి రైతు మృతి చెందిన ఘటన మండలంలోని తేజాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై ఇమ్రాన్ ఖాన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏలేటి నారాయణరెడ్డి (59) కోతుల బెడద నుంచి పంట రక్షణకు చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నాడు. గురువారం ఉదయం కోతులు వచ్చాయని తెలియగా వాటిని తరమడానికి చేనుకు వెళ్లాడు. ఈ క్రమంలో సోలార్ ఫెన్సింగ్ తీగకు తగిలి కింద పడ్డాడు. పక్కనే వ్యవసాయ క్షేత్రంలో ఉన్న రైతులు గమనించి అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ప్రైవేట్ వాహనంలో బోథ్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో అతడు మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుమారుడు నవనీత్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## కారు బోల్తా పలువురికి గాయాలు



**నేరడిగొండ, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. శుక్రవారం పోలీసు స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై కారు బోల్తాపడింది. ఈ ఘటనలో కారులో ఉన్న ఓ కుటుంబ సభ్యులకు గాయాలయ్యాయి. ఐతే అటుగా వస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రమాదాన్ని గమనించి, తన వాహనాన్ని ఆపి, తక్షణమే అంబులెన్స్‌కు కాల్ చేసి, క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకొని రోడ్డుపై ఉన్న కారును పక్కకు జరిపించారు.

## రైలు కిందపడి ఒకరి ఆత్మహత్య

**తలమడుగు, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
మండలంలోని ఉండం గ్రామానికి చెందిన హర్ష ముత్తుల వెంకటి (40) గ్రామ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటికి గతంలో ప్రమాదంలో కాలు విరగగా ఏపనీ చేయకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. రెండు రోజుల క్రితం బైక్‌పై గ్రామానికి చెందిన పోశెట్టిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో పోశెట్టి కాలు విరగడంతో పోలీస్‌స్టేషన్‌లో వెంకటిపై కేసు నమోదైంది. దీంతో జీవితంపై విరక్తితో శుక్రవారం గ్రామ శివారులో ఆదిలాబాద్ వైపు వస్తున్న కృష్ణ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ తెలిపారు.



# రోడ్డు ప్రమాదంలో వైద్యుడి మృతి



**ముథోల్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
పట్టణానికి చెందిన హోమియోపతి వైద్యుడు కుమార్ యాదవ్ (43) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పురాణాబజార్‌కు చెందిన డాక్టర్ కుమార్ యాదవ్ గురువారం బైక్‌పై నిర్మల్ వైపు వెళ్లి తిరిగి సాయంత్రం భైంసా వైపు వస్తుండగా, రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే మార్గంలో భైంసా-నిర్మల్ హైవేపై ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. ఏదైనా వాహనం ఢీకొందా.. లేదా అదుపు తప్పి కిందపడ్డాడా? అనే విషయం తెలియరాలేదు. అతడికి తీవ్ర గాయాలు కాగా, స్థానికులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఏరియాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులున్నారు. కుమార్ యాదవ్ స్థానికంగా హిందూ ఉత్సవ సమితి సభ్యుడిగా ఉంటూ స్వచ్ఛందంగా పలు సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. దీంతో ఆయన మృతిపై పట్టణానికి చెందిన వైద్యులు, పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# మద్యం మత్తులో గ్రూప్ వార్

### నిందితులపై కేసు నమోదు - అదుపులోకి తీసుకున్న పోలీసులు






**మందమర్రి, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
మద్యం మత్తులో గ్రూపు వార్ జరిగిన ఘటన మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెలితే ముఖ్యంగా మద్యం మత్తులో అల్లరి మూకలు రెచ్చిపోయి పరస్పరం కర్రలతో దాడి చేసుకున్నారు. రెండు గ్రూపులు పరస్పరం రాళ్ళు, కర్రలతో కొట్టుకున్నారు. తాగిన మైకంలో రోడ్డుపై వెళ్తున్న ఆటో హరాన్ చేస్తూ.. పక్కకు జరగండి అనే సరికి మత్తులో ఆటో ఉన్న వాళ్లపై ఇద్దరు విచక్షణ రహితంగా దాడి చేశారు. జరిగిన విషయాన్ని ఆటో డ్రైవర్ వాళ్ళ స్నేహితులకు చెప్పడంతో ఆటో డ్రైవర్ స్నేహితులు ఆరుగురు ఆటోలో వచ్చి మొదట దాడి చేసిన ఇద్దరి పైనా దాడి చేశారు. దీంతో స్థానికులు భయ బ్రాంతులు గురయ్యేలా షర్ట్ విప్పి రోడ్డుపై కర్రలతో, రాళ్లతో పరిగెత్తుతూ రోడ్లపైకి వచ్చి కొట్టుకున్నారు పోలీసులు రావణ దహన కార్యక్రమంలో మంత్రి వివేక్ రావడంతో బందో బస్తుల్లో ఉన్నారు. ఆటో సీజ్ చేసి నిందితులు కస్టడీలోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

**యువకులపై దాడి.. నిందితులపై కేసు నమోదు**

పట్టణంలోని పాలచెట్టు ఏరియాలో ఇద్దరు యువకులపై దాడి చేసిన నిందితులను అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ కే శశిధర్ రెడ్డి తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన దాడి ఘటన వివరాలు వెల్లడించారు. పాలచెట్టు ఏరియాలో ఉన్న పచ్చిక రవితేజ, బండ రాకేష్ లపై, పట్టణంలోని విద్యానగర్ కు చెందిన కొందరు యువకులు ఆటోయు టర్న్ చేసుకునే అని సందర్భంలో మాటా మాటా పెరిగి ఘర్షణకు దిగారు. తాగిన మైకంలో ఉన్న యువకులు బాధితులపై చేతులు, కర్రలు, రాళ్లతో విచక్షణ రహితంగా దాడి చేయగా పచ్చిక రవితేజ తలకు గాయాలయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులు కోట మహేష్, రెండ్ల శ్రీకాంత్, దానబోయిన నవీన్ కుమార్, పులి సతీష్, కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని ఈ దాడిలో ప్రధాన సూత్రధారి జిల్లపల్లి ఆకాష్ (బన్నీ), గుర్తు తెలియని వ్యక్తి పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే పట్టుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా దాడిలో గాయపడిన బండ రాకేష్ , అతని స్నేహితుడు బొంతల మురళితో కలిసి కోట మహేష్ పై దాడి చేయగా మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాకేష్, మురళిలపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, నేర ప్రవృత్తిని కొనసాగించే వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరించడంతో పాటు పీడీ యాక్ట్ నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

### నిమజ్జన శోభాయాత్రలో
## యువకుడికి గాయాలు

**ముథోల్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
ముథోల్ మండలంలోని బోరిగాం గ్రామంలో దుర్గా మాత నిమజ్జనం శోభాయాత్రలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తిరాయి విసరటంతో సౌండ్ సిస్టం మీద ఉన్న యువకుడికి తగిలింది. గాయపడ్డ యువకుడిని ఆసుపత్రికి తరలించారు. దీంతో నిమజ్జన శోభాయాత్ర తాత్కాలికంగా ఆగిపోయింది. ఇరు గ్రూపుల మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న బైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్, ముథోల్ సిఐ మల్లేష్, ఎస్ఐలు పోలిసులు, హుటహుటిన గ్రామానికి చేరుకొని గ్రామస్తులను సముదాయించారు. రాత్రి 7:30 ప్రాంతంలో దుర్గ మాత నిమజ్జన శోభాయాత్రను అడిషనల్ ఎస్పీ జోక్యంతో ముందుకు కదిలింది. దుర్గామాతను నిమజ్జన కోసం గ్రామస్తులు గోదావరి నదికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఆర్ఐ నారాయణరావు పటేల్, రెవెన్యూ సిబ్బంది, గ్రామానికి చేరుకొని పలు వివరాలను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనపై అడిషనల్ ఎస్పీ విలేకరులతో మాట్లాడారు. దుర్గ మాత నిమజ్జనం శోభయాత్ర జరుగుతున్నప్పుడు రాయి దాడిలో ఓ యువకుడికి గాయమైందని చెప్పారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామస్తులు పోలీసులకు సహకరించాలని కోరారు.

## దాడి ఘటనలో 48మంది గ్రామస్తులపై కేసు

**ఉట్నూర్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
మండలంలోని ఎక్స్‌రోడ్డు హనుమాన్‌నగర్ స్థలం విషయంలో కర్రలతో దాడి చేసిన 48 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. హనుమాన్‌నగర్‌కు చెందిన జాదవ మేఘనాథ్ కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. ఆయన స్థలంలో అదే గ్రామస్తులు జెండా పాతారు. తన స్థలంలో జెండా ఎందుకు పాతారు.. అని మేఘనాథ్ వారిని అడగగా మాటామాట పెరిగి కర్రలతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో 48 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



### తాగి వాహనాలు నడిపితే
## కఠిన చర్యలు తప్పవు

**ఉట్నూర్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
ఉట్నూర్ మండలంలోని ఎక్స్ రోడ్డు సమీపంలో ఎస్సై ప్రవీణ్ వాహనాల తనిఖీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. ఎవరూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. అంతేగాక వాహనదారులు బండి పత్రాలను తమ వెంట ఉంచుకోవాలన్నారు. ద్విచక్రవాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. అలాగే తాగి బండి నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు.

## గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

**దస్తూరాబాద్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**
మండలంలోని రేవోజీపేట గ్రామానికి చెందిన మోదం సురేందర్ (45) మృతదేహం కడెం ప్రధాన కాలువలో లభ్యమైనట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 1న కడెం ప్రధాన కాలువలో స్నానం చేయడానికి వెళ్లిన సురేందర్ ప్రమాదవశాత్తు కాలు జారి అందులో పడిపోయాడు. వరద ఉధృతిలో కొట్టుకుపోవటంతో ఇరిగేషన్ అధికారులకు సమాచారం తెలుపగా కడెం ఎడమ కాలువ నీటిని నిలిపి వేసి గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం బుట్టాపూర్ గ్రామ శివారులో కాలువ వద్ద చెట్ల పొదల్లో స్థానికులకు మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

## ప్రాణం తీసిన చేపల వేట

**ముథోల్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**



చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై షేక్ జుబేర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన దామాజీ సాయినాథ్ (40) ఈ నెల 1న చేపలు పట్టేందుకు సింగన్ం సమీపంలోని వాగుకు వెళ్లి రెండు రోజులైనా తిరిగి రాలేదు. బంధువుల ఇంటికి వెళ్లి ఉంటాడని కుటుంబ సభ్యులు భావించారు. ఆ మార్గంలో వెళ్తున్న కొంతమంది నీటిలో తేలిన మృతదేహాన్ని పరిశీలించి పోలీసుల కు సమాచారం ఇవ్వగా ఎస్సై ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించారు. తానూరువాసులు దామాజీ సాయినాథ్ గుర్తించారు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

## గామ పటేల్ సిడం జైతు మృతి

**కాసిపేట, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**



మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని ఆదివాసీ గిరిజన సాలేగూడ గ్రామ పటేల్ సిడం జైతు (68) ఆనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. గోండు దండారీ పాటల కళాకారులు, ప్రథమ నాటు వైద్యుడిగా, దాతగా సేవలు అందించారు. గ్రామంలో పాఠశాలకు, కమ్యూనిటీ హాల్తో పాటు గ్రామంలోకి పలువురి ఇళ్ల నిర్మాణాలకు సైతం భూమిని విరాళంగా అందించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆయన అకాల మరణం తీరని లోటని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మృతితో గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. శనివారం ఉదయం అంతక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.జైతుకు భార్య సిడం కమలాబాయి, కుమారుడు మోహన్ ఉన్నారు.






# అంబరాన్ని తాకిన దసరా సంబురాలు





**నిర్మల్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో దసరా సంబురాలు అంబరాన్నితాకాయి. ఊరూరా వేడుకలు నిర్వహించారు. శమీ పూజ, ఆయుధ పూజలు చేశారు. రాంలీల కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బంగల్పేట్ మహాలక్ష్మీ ఆలయం వద్ద విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం దసరా ఉత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మహేశ్వర్ రెడ్డి హాజరై మహాలక్ష్మీ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఎస్పీ జానకీ షర్మిల, ఏఎస్పీ రాజేష్ మీనా, వీహెచ్‌పీ నాయకులతో కలిసి శమీపూజ, ఆయుధపూజ, దుర్గాపూజలను చేసి దసరా ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం దసరా ఉత్సవ సభలో మాట్లాడుతూ అధర్మంపై ధర్మం గెలిచిన సందర్భంగా దసరా పండుగను చేసుకుంటామన్నారు. ప్రతీ తల్లి జిజియాబాయిలా ఆలోచించాలని, తమ బిడ్డలను శివాజీ, భగత్ సింగ్ తయారు చేయాలన్నారు. దేశం, ధర్మం, సంస్కృతిపై ఆరాధన భావం పెరిగేలా ఇప్పటి తరాన్ని తయారు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక సమరతా తెలంగాణ ప్రాంత కన్వీనర్ అప్పాల ప్రసాద్, బీజేపీ సీనియర్ నేత అయ్యన్నగారి భూమయ్య, విశ్వహిందూ పరిషత్ ముఖ్యులు పతికె రాజేందర్, ముప్పిడి రవి, పార్థసారధి, మూర్తి ప్రభాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ భీంరెడ్డి, ఆంజనేయ యువజన సంఘం అధ్యక్షుడు పెందెం శ్రీనివాస్, మహాలక్ష్మీ ఆలయ కమిటీ అధ్యక్షుడు కొడుకుల శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు. ఖానాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉత్సవాల్లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ విజయదశమి అందరికీ విజయాన్ని తెచ్చిపెట్టాలని అకాంక్షించారు. ఆర్ఎస్ఎస్ ఇందూర్ విభాగ్ ప్రచారక్ నర్రా శివకుమార్ మాట్లాడుతూ.. కుల, మతాలను గౌరవించి భిన్నత్వంలో ఏకత్వంగా ప్రపంచంలోనే లౌకికదేశంగా భారతదేశం నిలిచిందన్నారు. హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు మంత్రరాజ్యం సురేశ్ ధ్వజారోహణ చేశారు. పది తలల రావణాసురుని ప్రతిమను దహనం చేశారు. జమ్మి ఇచ్చి పుచ్చుకుని దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. భైంసాలో కిసాన్ సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాగత వేదికపై ఎమ్మెల్యే రామారావు పటేల్, ఏఎస్పీ అవినాష్ కుమార్ మాట్లాడారు. రాంలీలా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఉత్సవ సమితి అధ్యక్ష, కార్యదర్శులు సురేశ్, శ్యామ్, నాయకులు వెంకటేశ్వర్లు, బీసీరాజన్న, శ్రీనివాస్, రాజు, కృష్ణ స్వామి, సంతోష్, లక్ష్మణ్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలు కూల్చివేసిన సింగరేణి అధికారులు

**బెల్లంపల్లి, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి పట్టణంలో ఖాళీ స్థలం ఆక్రమణ యత్నాన్ని స్థానిక యువకులు, మహిళలు అడ్డుకున్నారు. దీంతో సింగరేణి అధికారులు అక్రమ నిర్మాణాలు కూల్చి వేసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. పట్టణ నడిబొడ్డున ఉన్న రూ.కోట్లు విలువై చేసే సింగరేణి లీజు భూమిలో ఓ సామాజిక వర్గానికి చెందిన శ్రేణులు బుధవారం రాత్రి గుట్టుగా చదును చేసి పిచ్చిమొక్కలు తొలగించారు. ఇప్పటికే ఆ సామాజిక వర్గానికి ఫంక్షన్ హాల్, కులదైవం గుడిని సింగరేణి లీజు స్థలంలో నిర్మించుకోగా కొత్తగా ప్రహరీ ఆనుకుని అర ఎకరానికి పైగా ఉన్న భూమిని ఆక్రమించడం కలకలం రేపింది. మూసివేతకు గురైన సౌత్ క్రాస్కట్ గని ఉపరితలంలో ఇంకా మూడెకరాలకు పైగా సింగరేణి లీజు భూమి ఉంది. ఆ భూమిపై కన్నేసిన కొందరు అర్ధరాత్రి ట్రాక్టర్‌తో పిచ్చిమొక్కలు తొలగించి గుడి ముందున్న ప్రహరీ కొంత తొలగించి కొత్తగా గేటు ఏర్పాటు చేశారు. సిమెంటు గద్దె నిర్మించి విగ్రహాలు నెలకొల్పి ఆధీనంలోకి తీసుకున్నారు. శుక్రవారం ఉదయం సదరు సామాజిక వర్గానికి చెందిన మహిళలు, వక్తలు ప్రత్యేక పూజలు చేశారు. ఆ విషయమై 31వ వార్డు యువకులు, మహిళలు సింగరేణి అధికారులకు సమాచారం అందించారు. సామాజిక మాధ్యమాల్లో భూ ఆక్రమణ ఫొటోలు పోస్టు చేయడంతో చర్చనీయాంశమైంది. మందమర్రి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాధాకృష్ణ ఆదేశాలతో సింగరేణి ఎస్టేట్, సింగరేణి అటవీ శాఖ, ఎండీపీసీ అధికారులు, సిబ్బంది వచ్చి భూ ఆక్రమణ చర్యలను అడ్డుకున్నారు. చదును చేసిన ఖాళీ స్థలంలో ఆక్రమణలను బ్లేడ్ ట్రాక్టర్‌తో తొలగించారు. ఆక్రమణకు గురికాకుండా మొక్కలు నాటారు. సదరు



భూమి సింగరేణి కంపెనీదని, ఎవరైనా కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే చర్యలు తీసు కుంటామని రెండు చోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. మరెవరైనా భూ కబ్జా చేస్తే పేదలతో నివాస గృహాలు ఏర్పాటు చేయిస్తామని 31వ వార్డు ప్రజలు సింగరేణి అధికారులకు తెగేసి చెప్పారు. వార్డు యువకులకు కాంగ్రెస్, సీపీఐ, బీఆర్ఎస్ శ్రేణులు మద్దతుగా నిలిచారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

# కడెం ప్రాజెక్టు ఆధునికీకరణకు ఉద్యమం

**దండేపల్లి, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**



చెన్నూరు వరకు సాగునీరు అందించాలని మండలంలోని నెల్కి వెంకటాపూర్‌కు చెందిన గాదె శ్రీనివాస్ కొంతమంది రైతులతో కలిసి దసరా పండుగను పురస్కరించుకుని గురువారం కడెం ప్రాజెక్ట్ ఆధునికీకరణ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కడెం ప్రాజెక్ట్ నీటిని చెన్నూరు వరకు అందించేందుకు 1987లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ హాజీపూర్ మండలం పెద్దంపేట వద్ద మందాకిని కాలువ నిర్మాణానికి భూమిపూజ చేశారని, అది ఇప్పటికీ పూర్తికాలేదన్నారు. కడెం నీటిని చెన్నూర్ వరకు అందించాలంటే మొదటగా కడెం ప్రాజెక్టును ఆధునికీకరించాలన్నారు. ఎందుకంటే ప్రస్తుతం ఉన్న నీరు హాజీపూర్ మండలం వరకే అందించడం గగనంగా మారిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు కడెం ప్రాజెక్ట్ ఆధునికీకరణపై దృష్టిసారించి అప్పటి ప్రధాని, ముఖ్యమంత్రుల హామీ లను అమలు చేయాలని కోరారు. కడెం ప్రాజెక్టును ఆధునికీకరించే వరకు ఆయకట్టు రైతులతో కలిసి ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.

### అశ్వరథంపై సరస్వతీ

# అమ్మవారి ఊరేగింపు

### బాసరలో ముగిసిన శారదీయ శరన్నవరాత్రి ఉత్సవాలు

**ముథోల్, అక్టోబర్ 3 (ప్రభాత సమాచారం)**

బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో శారదీయ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో ఆలయ అర్చకులు సరస్వతీ అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అశ్వరథంపై అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని కూర్చోబెట్టి భక్తుల దర్శనార్థం గ్రామంలోకి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అశ్వరథం గ్రామంలోకి రావడంతో మహిళలు మంగళహారతులతో అమ్మవారికి ఘనస్వాగతం పలికారు. భక్తి గీతాలు, కోలాటాల మధ్య అమ్మవారి అశ్వరథం ఊరేగింపు కొనసాగింది. శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి అశ్వరథం ఊరేగింపు కోసం స్వచ్ఛందంగా గ్రామానికి చెందిన ప్యాట్ల సుఖేశ్ రావు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా వారిని దేవస్థానం తరఫున కార్యనిర్వహణాధికారి అంజనాదేవి, ఏఈవో సుదర్శన్ గౌడ్ శాలువాతో సన్మానించారు.

**బాసరకు శృంగేరి పీఠాధిపతి...**

కర్ణాటక రాష్ట్రంలోని మహాస్థానం దక్షిణమనయ శ్రీశారదాపీఠం శృంగేరి జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీ విధుశేఖర భారతీయ సన్నిధానం పీఠాధిపతి బాసరకు రానున్నారు. శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి క్షేత్ర పర్యటన ఈ నెల 17నుంచి 19వరకు కొనసాగనుంది. నేపాల్, న్యూఢిల్లీ, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల మీదుగా యాత్ర చేపడుతూ బాసరలో సరస్వతీ అమ్మవారికి రెండురోజులపాటు ప్రత్యేక పూజలు చేయనున్నట్లు దేవస్థానం అధికారులు వెల్లడించారు.

